

చేప ఎక్కడబ్బా... ఇదిగో ఇక్కడుంది ఇవాళ్టికి ఓకే...








గుంటూరు చుట్టుగుంట చెరువులో కనిపించే తెల్ల కొంగలు ఒక కొత్త అందాల లోకాన్ని తలపిస్తుంటాయి. చేపల వేటలో భాగంగా చెరువులో వాటి విన్యాసాలు కనువిందు చేస్తున్నాయి. మార్నింగ్ వాక్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ ఈ తెల్ల బంగారు లోకం చూసి కొత్త అనుభూతికి లోనవుతుంటారు.

- గుంటూరు (ఆంధ్రజ్యోతి)

అరాచకంపై సీఐడీ



చంద్రయ్య (ఫైల్‌ఫోటో)

- వైసీపీ హయాంలో ఆటవిక రాజ్యం
- నేతల ప్రోద్బలంతో అట్టుడికిన పల్నాడు
- టీడీపీ నేతల హత్యలపై స్పందించిన ప్రభుత్వం
- చంద్రయ్య హత్యపై సీఐడీ విచారణ
- జల్లయ్య కేసూ విచారించాలంటున్న టీడీపీ శ్రేణులు

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడు ప్రాంతంలో అరాచకం రాజ్యమేలింది. ముఖ్యంగా మాచర్ల, గురజాల నియోజక వర్గాల్లో పిన్నెల్లి సోదరులు సాగించిన అరాచకాలతో టీడీపీ శ్రేణులు ఇప్పటికీ తేరుకోలేదు. వరుస హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, లూటీలతో పల్నాడు అట్టుడికింది. గ్రామాలకు గ్రామాలు ఖాళీ అయ్యాయి. టీడీపీ కార్యకర్తలను వెంటాడి వేటాడి దారుణంగా హతమార్చారు. కనీసం పోలీస్ స్టేషన్‌లకు వెళ్ళి ఫిర్యాదులు చేసే ధైర్యం కూడా చేయలేకపోయారు. చివరకు విజయవాడకు చెందిన టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బోండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది పారా కిశోర్‌లపై వైసీపీ నేత , పిన్నెల్లి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ చేసిన హత్యాయత్నం ఘటన పల్నాడులో నెలకున్న దారుణ పరిస్థితులను ప్రపంచానికి చాటిచెప్పింది. అయితే ఆయా ఘటనలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన చంద్రయ్యను 2022 జనవరి 13న వైసీపీ గూండాలు అత్యంత దారుణంగా గొంతు కోసి హత్య చేశారు. జై జగన్ అంటే ప్రాణాలతో వదిలేస్తామని రౌడీలు చంద్రయ్య గొంతుపై కత్తి పెట్టినప్పటికీ జై చంద్రబాబు అనడంతో దారుణంగా హతమార్చారు. దారుణ హత్యకు గురైన టిడిపి నాయకుడు చంద్రయ్య అంత్యక్రియలకు హాజరైన నాటి ప్రతిపక్ష నేత టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు ఆయన పాడెమోసి కార్యకర్తల్లో భరోసా నింపడానికి ప్రయత్నించారు. చంద్రయ్య హత్య కేసులో గత ప్రభుత్వ హయాంలో విచారణ తూతూ మంత్రంగా చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రయ్య హత్యను సీఐడీకి ఇస్తూ నెల రోజుల క్రితం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా ఆ కేసు దస్త్రాలను సీఐడీ అధికారులకు అప్పగించాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే చంద్రయ్య తరహాలోనే పల్నాడులో జరిగిన జల్లయ్య హత్య కూడా సంచలన సృష్టించింది. చంద్రయ్య హత్య జరిగిన ఆరు నెలలకు అంటే 2022 జూన్ 3న జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హతమార్చారు.

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పల్నాడు ప్రాంతంలో వెసీపీ అరాచకాలకు తెగబడింది. దీంతో ఎంతో మంది టిడిపి కార్యకర్తలు, నాయకులు గ్రామాలను వదిలి వెళ్లిపోయారు. ఏళ్ల తరబడి సుదూర ప్రాంతాల్లో ప్రాణాలు రక్షించుకునేందుకు అజ్ఞాతంలో ఉన్నారు. దీనిలో భాగంగానే దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన గ్రామ టీడీపీ నాయకుడు జల్లయ్య గ్రామాన్ని వదిలి గురజాల పరిధిలోని మాడుగులలో తలదాచుకుంటున్నాడు. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం జల్లయ్యను హతమారిస్తే తమకు ఎదురుండదని వైసీపీ నాయకులు భావించారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రధాన అనుచరుడైన జంగమహేశ్వరపాడుకు చెందిన మన్నెయ్య, ఆయన సోదరులు జల్లయ్యను హతమార్చేందుకు అప్పటికే సిద్ధమయ్యారు. ఇదిలాఉంటే 2022 జూన్ మూడున జల్లయ్య రావులాపురం గ్రామంలో జరుగుతున్న తన అన్న కుమార్తె వేడుకకు వస్తుండగా సమాచారం తెలుసుకున్న వైసీపీ నాయకులు, పిన్నెల్లి ప్రధాన అనుచరులైన మన్నెయ్య నేతృత్వంలో జంగమహేశ్వరపాడు శివారు కాకిరాల అటవీ ప్రాంతంలో దారి కాచి కత్తులతో పొడిచి దారుణంగా హత మార్చారు. ఈ హత్య కూడా తీవ్ర సంచలన సృష్టించింది. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పల్నాడులో వరుసగా జరుగుతున్న హత్యలతో భీతావహులయ్యారు. పల్నాడు లో జరిగిన వరస హత్యలకు నాటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిల పరోక్ష పాత్ర ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో అప్పట్లో జరిగిన ఘటనలపై కేసులు కూడా నమోదు కాలేదు. చంద్రయ్య, జల్లయ్య లాంటి సంచలనం సృష్టించిన హత్య కేసుల్లోనూ విచారణ తూతూ మంత్రంగా సాగింది. ఈ నేపథ్యంలో నాటి చంద్రయ్య హత్యను పునర్విచారణ జరిపించాలంటూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది ఈ మేరకు ఇప్పటికే ఈ కేసును సీఐడీకి అప్పగించింది. తాజాగా జల్లయ్య హత్యపై కూడా యువనేత మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. జల్లయ్య హత్యను కూడా సీఐడీకి బదిలీచేయాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. ఈ కేసుపై కూడా నెల 18న ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జల్లయ్య హత్యతోపాటు పల్నాడు ప్రాంతంలో జరిగిన అన్ని ఘటనలపై ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపించాలని పల్నాడు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (మంగళవారం)

సహరి : 5.02 (బుధవారం)

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చి యార్డులో భారీ అవినీతి జరిగింది. అక్కడ జరిగిన అవినీతి, అక్రమాలపై అందిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి రూ.347 కోట్ల మేర అవినీతి జరిగిందని గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అప్పటి యార్డు ఛైర్మన్,మార్కెటింగ్ అధికారులు, ఉద్యోగులపై చర్యలకు సిఫార్సు చేశారు. ఇదంతా గత ఏడాది డిసెంబర్‌లో వెలుగులోకి వచ్చింది. అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ వ్యవహారంలో ఇక ఏదో జరిగిపోతుందని అందరూ భావించారు. .కానీ అలా ఏమీ జరగలేదు. ఎవరిపైనా ఏ చర్య తీసుకోలేదు. పైగా విజిలెన్స్ నివేదిక వచ్చిన తరువాత కొందరికి కొత్తగా పోస్టింగ్‌లు ఇచ్చారు.మరికొందరిని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టారు. టోటల్‌గా చెప్పాలంటే మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు విజిలెన్స్ ఇచ్చిన నివేదికను,చేసిన సిఫార్సులను అటకెక్కించారు.

- నెలలు దాటినా చర్యలు శూన్యం
- అక్రమాలకు పాల్పడిన వారికి అందలాలు
- మార్కెటింగ్ శాఖలో చిదంబర లీలలు

అటకెక్కిన రూ. 347 కోట్ల అవినీతి నివేదిక

అక్రమార్కులకు.. అందలం



గుంటూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్లలో గుంటూరు మిర్చి యార్డును అవినీతి,అక్రమాలకు అడ్డాగా మార్చిన వారిపై మార్కెటింగ్ శాఖ ఉదాసీనత ప్రదర్శిస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. వారి అక్రమాలపై విజిలెన్స్ నివేదిక వచ్చిన తరువాత కూడా చర్యలకు ఉపక్రమించక పోవటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది నవంబర్‌లోనే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు చూస్తుంటే విజిలెన్స్ నివేదికను మార్కెటింగ్ శాఖ పూర్తిగా పక్కన పెట్టేసినట్లు అర్థం అవుతున్నది. ఇందుకోసం ఉన్నత స్థాయి లాబీయింగ్ నడిచినట్లు ఆరోపణలు వస్తున్నాయి. యార్డులో జరిగిన అవినీతిలో మొత్తం 20 మంది కీలక పాత్ర పోషించినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో మార్కెటింగ్ శాఖలోని ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. పలువురు యార్డు సెక్రటరీలు, సూపర్ వైజర్లు ప్రధాన పాత్రధారులుగా ఉన్నట్లు తేల్చారు. వారి వల్లనే వివిధ రూపాల్లో యార్డు కు రావాల్సిన రూ.347 కోట్ల ఆదాయానికి గండి పడినట్లు నిర్ధారించారు. ఒక సెక్రటరీ లైసెన్స్ రెన్యువల్ వ్యవహారంలో పూర్తి స్థాయి గుత్తాధిపత్యం ప్రదర్శించినట్లు కూడా నివేదికలో విజిలెన్స్ స్పష్టం చేసింది.

మెమో ఇంకా రాలేదా ..?

విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి చేరిన తరువాత బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై చర్యలు నిమిత్తం మెమో జారీచేస్తుంది. ఆ మెమో ఆధారంగానే మార్కెటింగ్ శాఖ చర్యలకు ఉపక్రమించటం జరుగుతుంది. ప్రభుత్వానికి నివేదిక చేరిన అతి తక్కువ సమయం లోనే ఈ మెమో జారీ అవుతుంది. యార్డు వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా జరిగింది. నివేదిక వెళ్లిన నాలుగు నెలల తర్వాత కూడా ఏ విధమైన స్పందన కనపడటం లేదు. ప్రభుత్వం అసలు మెమోనే జారీ చేయలేదా. ఒక వేళ ప్రభుత్వం మెమో జారీచేసిన తర్వాత కూడా చర్యలకు మార్కెటింగ్ శాఖ మీన మేషాలు లెక్కిస్తుందా..? అన్న దానిపై చర్చ జరుగుతున్నది. గత ప్రభుత్వ హయాంలో యార్డులో ఏకచత్రాధిపత్యం సాగించిన కొందరికి మంచి స్థానాల్లో పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ఎవరిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఏవిధమైన చర్యలు చేపట్టకుండా ఉండేందుకు వాళ్లే పావులు కదుపుతున్నారన్న ప్రచారం జరుగుతున్నది. విజిలెన్స్ నివేదికను అటక్కెకించటంలో కూడా వాళ్ల పాత్రే కీలకంగా ఉన్నట్లు సమాచారం. వేరే వ్యవహారంలో రూ. కోట్ల ముడుపులు ముట్టజెప్పినందుకు నజరానాగా ఈ వ్యవహారం పక్కన పెట్టమని కోరినట్లు ప్రచారం సాగుతోంది.



గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం

బీఈడీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో

పది మంది అరెస్టు

- వినుకొండ వివేకానంద కళాశాల కరస్పాండెంట్‌దే కీలకపాత్ర
- ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడి

8

ఆకలి కేకలు

- ఎస్సీ కళాశాల హాస్టల్స్‌లో నాణ్యతలేని భోజనం
- రైస్ కుక్కర్లతో విద్యార్థులే వండుకుంటున్నవైనం
- కొందరికి అన్న క్యాంటీనే ఆధారం
- బోగస్ హాజరుతో భారీ ఎత్తున అక్రమాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

- మార్కెట్ ఫీజుల వసూళ్లలో ఏఎంసీల వెనకడుగు
- బాపట్లలో ప్రకృతి విపత్తులు
- పల్నాడులో సాగునీటి కష్టాలు
- గుంటూరులో కొనుగోళ్ళ సెస్సు పెండింగ్

20 రోజులు రూ. 50 కోట్ల లక్ష్యం



గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లలో మార్కెట్ ఫీజు వసూళ్లు ఈ ఏడాది అంత ఆశాజనకంగా లేవు. మరో 20 రోజుల్లో 2024-25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండగా నేటికి 76 శాతం మధ్యనే వసూళ్లు జరిగాయి. ఇప్పటినుంచి కేవలం ఒక్క గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో మిర్చి లావాదేవీలు కారణంగా కొంతవరకు మార్కెట్ ఫీజు వసూళ్లకు అవకాశం ఉన్నది. మిగతా ఏఎంసీల పరిధిలో కలెక్షన్స్ నామమాత్రంగానే జరుగుతాయి. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ రాష్ట్ర శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏఎంసీలకు కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆ శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ విజయ సునీత ఏఎంసీల సెక్రెటరీలు, ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, డీడీ, ఏడీలతో సమావేశం కావాలని నిర్ణయించారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు జిల్లాకు మార్కెట్ ఫీజు వసూళ్లను రూ. 133.69 కోట్లుగా మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని నిర్దేశించింది. అందులో ఇప్పటివరకు 102.81 కోట్లు వసూలు చేసి 76.91 శాతం లక్ష్యానికి చేరుకొన్నది. పల్నాడు జిల్లాలోని 12 ఏఎంసీలైన నరసరావుపేట, చిలకలూరిపేట, రొంపిచర్ల, సత్తెనపల్లి, క్రోసూరు, రాజుపాలెం, పిడుగురాళ్ల, గురజాల, మాచర్ల, ఈపూరు, వినుకొండ, దుర్గికి కలిపి రూ. 32.14 కోట్లు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు కేవలం రూ. 21 కోట్లు మాత్రమే వసూళ్లు జరిగాయి. బాపట్ల జిల్లాలో ఏఎంసీలకు రూ. 30.21 కోట్లు లక్ష్యం ఇవ్వగా రూ. 22.65 కోట్లు వసూళ్లు చేశారు. ఈ విధంగా మూడు జిల్లాలకు కలిపి రూ. 196.08 కోట్లు లక్ష్యం కాగా రూ. 146.46 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ. 50 కోట్ల లోటు ఉన్నది.

మార్కెట్ ఫీజు కలెక్షన్ పైనే ఏఎంసీలు ఆధారపడి ఉన్నాయి. అయితే ఉమ్మడి జిల్లాలో కొన్ని మాత్రమే కార్యకలాపాలు జరిగే ఏఎంసీలు ఉండగా మిగతావాన్ని చెక్‌పోస్టులలో వసూలు చేసే సెస్సు పైనే ఆధారపడుతున్నాయి. గుంటూరు జిల్లాలో పేరుకు ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీలుండగా వీటిల్లో గుంటూరు, దుగ్గిరాల, తెనాలి మాత్రమే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అలానే పల్నాడులో 12 ఏఎంసీలున్నప్పటికీ గురజాల ఒక్కటే కార్యకలాపాలు జరిపే యార్డుగా ఉన్నది. బాపట్లలో నాలుగు ఏఎంసీలుండగా ఇవన్నీ ధాన్యం, అపరాలపై ఆధారపడుతున్నాయి. కాగా గత ఏడాది రబీ సీజన్‌లో సాగర్ కాలువలకు సాగునీరు విడుదల చేయలేదు. దాంతో పంట విస్తీర్ణం తగ్గి మార్కెట్ ఫీజు వసూళ్లపై దాని ప్రభావం పడింది. బాపట్ల జిల్లాలో ఈ ఏడాది ప్రకృతి విపత్తులు సంభవించడంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయి. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ సంవత్సరం మిర్చి ధర పతనం అయింది. గత ఏడాది క్వింటాల్ రూ. 18 వేల వరకు ఉంటే ఈ సంవత్సరం మార్కెట్ ప్రారంభంలో రూ. 9 వేల నుంచి రూ. 11 వేల మధ్యనే ఉన్నది. ఇది కూడా మార్కెట్ ఫీజు తగ్గడానికి కారణంగా మారింది. మరోవైపు పౌరస రఫరాల సంస్థ చేస్తోన్న ధాన్యం కొనుగోళ్లు, సీసీఐ చేసిన పత్తి కొనుగోళ్లపై ఇంకా ఏఎంసీలకు మార్కెట్ ఫీజులు జమ కాలేదు. మార్కెట్ ఫీజు వసూళ్లు తగ్గడానికి వీటన్నింటిని కారణాలుగా మార్కెటింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లా ఏఎంసీలలో ఫీజుల వసూళ్లు ఇలా...

మార్కెట్ కమిటీ	లక్ష్యం (రూ.కోట్లలో)	వసూళ్లు చేసిన మొత్తం (రూ.కోట్లలో)
ఫిరంగిపురం	1.95	1.19
మంగళగిరి	3.10	2.10
తాడికొండ	2.10	1.46
గుంటూరు	106	79.20
పొన్నూరు	6.95	6.10
ప్రత్తిపాడు	3.72	3.31
తెనాలి	6.60	6.18
దుగ్గిరాల	3.27	3.24
పల్నాడు (అన్ని ఏఎంసీలు)	32.14	21
బాపట్ల (అన్ని ఏఎంసీలు)	30.21	22.65
మొత్తం	196.08	146.46



కొమ్మాళ్ల కాలువ గుండా వ్యర్థాలు చంద్రవంకలోకి..

నాడు పవిత్రం.. నేడు వ్యర్థాల మయం

- దుర్గంధం వెదజల్లుతున్న చంద్రవంక
- ఆధునీకరణ జరిగేదెన్నడో..!

మాచర్ల టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఘన చరిత్ర కలిగిన చంద్రవంక నేడు వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దక్షిణ కాశీగా పేరొందిన చంద్రవంక రానురాను పవిత్రతను కోల్పోతోంది. గతంలో శ్రీలక్ష్మీ చెన్న కేశవస్వామిని దర్శించుకునే భక్తులు ముందుగా చంద్రవంక నదిలో స్నానమాచరించేవారు. అంతటి వైభవమున్న చంద్రవంక నేడు మరో మూసీ నదిని తలపిస్తోంది. చెత్తాచెదారాలు, పండ్ల మార్కెట్‌లోని వ్యర్థాలు, జంతు కళేబరాలతో చంద్రవంక కంపు కొడుతోంది. చెన్నకేశవుని ఆలయానికి ఉత్తరం నుంచి పడమర దిక్కుకు ప్రవహించే ఈ నదిలో ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాలు, ముళ్ల పొదలు, మురుగునీరు నిండిపోవడంతో రూపురేఖలు కోల్పోయింది.

మురుగునీరంతా చంద్రవంకలోకే...

పట్టణంలోని కొమ్మాళ్ల కాలువ వ్యర్థాలు, చెత్తాచెదారం చంద్రవంకలో కలుస్తోంది. పట్టణంలోని 16, 17, 18 వార్డుల గుండా మురుగునీరు ప్రవహిస్తుండడంతో ఆయా వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువ నుంచి వచ్చే కంపు భరించలేక అల్లాడిపోతున్నారు. దీనికితోడు కాలువలో పూడిక తొలగించకపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. ఆయా వార్డుల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకు ఏర్పాటు చేసుకోకుండా మల విసర్జన కొమ్మాళ్ల కాలువలోనే కావడంతో మరింద దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది వార్డుల ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. 16వ వార్డులోనైతే పందులు స్వైర విహారం చేస్తున్నాయి.

ఆధునీకరణ జరిగేదెన్నడో..!

పట్టణం గుండా ప్రవహించే చంద్రవంక నది వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీటితో పట్టణంపై విరుచుకుపడి తీవ్ర నష్టం కలిగిస్తోంది. చంద్రవంకకు ఇరువైపులా ఆక్రమణలతో కుచించుకుపోయి రూపురేఖలను కోల్పోయింది. సహజసిద్ధంగా ఏర్పడ్డ ఈ నది ఆక్రమణలతో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తోంది. వరదల నుంచి పట్టణ ప్రజలకు విముక్తి కలిగించేందుకు చంద్రవంక నదికి ఇరువైపులా సేఫ్టీ వాల్స్, బండ్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉన్నప్పటికీ ఆ వైపు అడుగులు పడడడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



చెత్తాచెదారంతో నిండిన చంద్రవంక

మంగళగిరిలో ఉచిత బస్సు సేవలు

- సీఎస్ఆర్ నిధుల కింద రెండు బస్సులు మంజూరు
- ఒకటి ఎయిమ్స్‌కు.. మరోటి నృసింహాలయానికి..
- ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించిన మంత్రి లోకేశ్



బస్సులను ప్రారంభించి ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్‌కు తాళం అందజేస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ఉచిత ఎలక్ట్రిక్ బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం ఉండవల్లిలోని నివాసంలో జెండా ఊపి ఈ బస్సులను ప్రారంభించారు. వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికి, పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వచ్చే ప్రజలు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ సీఎస్ఆర్ నిధుల నుంచి బస్సులను సమకూర్చాల్సిందిగా మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కోరారు. లోకేశ్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సదరు సంస్థ రూ.2.4 కోట్ల విలువైన రెండు అత్యాధునిక ఒలెక్ట్రా ఏడు మీటర్ల ఎలక్ట్రిక్ బస్సులను అందజేసింది. ఒక బస్సు మంగళగిరి ఆర్టీసీ బస్టాండు నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్, డీజీపీ కార్యాలయం మీదుగా ఎయిమ్స్‌కు నడుస్తుంది. మరో బస్సు మంగళగిరి బస్టాండు నుంచి ఎన్నారై జంక్షన్ మీదుగా పానకాలస్వామి గుడివరకు నడుస్తుంది. ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ అండ్ ఎండీ కేవీ ప్రదీప్, ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ శాంతా సింగ్ అహెంతెమ్, డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, నృసింహాలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, టీటీడీ బోర్డు మెంబరు తమ్మిశెట్టి జానకీదేవి, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, టీడీపీ నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, కొల్లి శేషు, తాళ్ల అశోక్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా వివా 'ఐబీ గ్రాడ్యుయేషన్' డే వేడుకలు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్‌లో అంతర్జాతీయ స్థాయి ఐబీ (ఇంటర్నేషనల్ బాకలారియేట్) విద్యావిధానంలో ప్రీ ప్రైమరీ విద్యను ముగించుకుని ప్రైమరీ విద్యకు, ప్రైమరీ విద్యను ముగించుకొని మిడిల్ స్కూలు ప్రవేశం పొందుతున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేడ్ 1, గ్రేడ్ 6 తరగతులకు ప్రవేశించనున్న విద్యార్థులను అభినందిస్తూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, శాస్త్రీయ, ఆధునిక నృత్యాలు, గీతాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కేఎస్.రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ ప్రోగ్రాం సంధానకర్త కె.మాధవి, జూనియర్ క్యాంపస్ హెడ్ మామిళ్లపల్లి వేదవాణి, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుబారాకు అడ్డుకట్ట పడేనా?

- అమరేశ్వరాలయంలో నిబంధనలు ఉల్లంఘించి మరీ ఖర్చులు
- కోర్టును ఆశ్రయించిన భక్తుడు

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతూ గ్రూప్ 2 ఆలయంగా గుర్తింపు పొందిన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో స్వామివారి ఆదాయంపై జరుగుతున్న దుబారా ఖర్చులకు అడ్డుకట్ట పడేనా అని భక్తులు చర్చించుకుంటున్నారు. ఆలయాన్ని పునర్నిర్మించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఆలయ నిర్వహణకు, ఆలయంలో పనిచేసే అర్చకులకు, వివిధ సేవలు చేసే వారికి వందల ఎకరాలు దానం చేశారు. అమరేశ్వరునికి తెలంగాణ రాష్ట్రంలోని దెందులూరులో 485 ఎకరాలు, అమరావతిలో 67, దాములూరులో 5 , దమ్మాలపాడులో 110, మాదలలో 90 ఎకరాలు ఉండగా దెందులూరులోని భూమికి కౌలు ద్వారా రూ. 4 లక్షలు, ఇక్కడ ఉన్న భూములకు రూ. 26 లక్షలు ఆదాయం వస్తుంది. ఇక హుండీలు, ఆర్జిత సేవల ద్వారా రూ. 3.2 కోట్ల ఆదాయం వస్తుంది. వస్తున్న ఆదాయంలో అర్చకుల, ఉద్యోగుల జీతభత్యాలు 30 శాతం ఖర్చు చేయాల్సి ఉండగా అధికంగా 45 శాతం ఖర్చు చేస్తున్నారు.

రాజకీయ జోక్యంతో...

విజయవాడకు చెందిన మార్కండేయ శర్మ అనే భక్తుడు ఆలయంలో స్వామి వారి ఆదాయం ఖర్చు, అర్చకుల విధులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకం, పెంచిన జీతాలు తదితర అంశాలపై అక్రమాలు జరుగుతున్నాయనీ, ఓ వైసీపీ నాయకుడి కారు డ్రైవర్‌కు కూడా జీతం ఇచ్చారని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వివరణ ఇవ్వాలని దేవదాయ కమిషనర్‌ను కోర్టు ఆదేశించగా ఆలయ అధికారుల నిర్వాకంతో తగిన సమయంలో వివరణ ఇవ్వలేదు. దీంతో పిటిషనర్ మళ్లీ కోర్టును ఆశ్రయించగా కోర్టు కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి ఆలయంలో లావాదేవీలకు సంబంధించిన నివేదికను అందజేయాలని ఆదేశించింది. దీంతో కమిషనర్ ఇద్దరు డీసీలతో విచారణ కమిటీ ఏర్పాటు చేసి వారు



అమరేశ్వరస్వామి

తయారు చేసిన రిపోర్టును కోర్టుకు సమర్పించారు. ఆలయానికి ఆదాయం రూ. 3.5 కోట్లు ఉండగా, 30శాతం మాత్రం జీతాలకు ఖర్చు చేయాల్సి ఉంది. కానీ 45 శాతం ఖర్చు చేస్తున్నారు. పెంచిన జీతాలు, కాంట్రాక్టు సిబ్బంది నియామకం, ఇతర దేవాలయాల నుంచి ఇక్కడికి ఉద్యోగులు రావడం ఖర్చు పెరుగుదలకు కారణాలుగా గుర్తించారు. పెంచిన జీతాలు తగ్గించాలనీ, ఇతర దేవాలయాల నుంచి వచ్చిన వారిని వెనక్కు పంపించాల్సి ఉంది. ఈ మేరకు కోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేయాల్సి ఉంది. రాజకీయ నాయకుల జోక్యంతో చర్యలు కొంత ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తుంది. నిబంధనలు ఉల్లంఘించి ఆలయ ఆదాయంలో అదనంగా రూ. 50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కొంతమంది ఉద్యోగులను మాతృసంస్థకు పంపేందుకు నోటీసులు ఇవ్వగా, కొందరిని ఆపేందుకు స్థానిక ప్రజాప్రతినిధి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సదావర్తి సత్రంలో కూడా..

ఆలయానికి అనుబంధంగా ఉన్న సదావర్తి సత్రంలో కూడా ఆదాయం కన్నా ఖర్చు అధికమౌతుంది. సత్రానికి మద్రాసులో 471 ఎకరాలు, కొగంటివారిపాలెంలో 71 ఎకరాలు భూములు ఉండగా మద్రాసులోని భూముల ద్వారా సత్రానికి రావాల్సిన రూ. 60 కోట్లు వైసీపీ నాయకుల కుట్రతో వెనక్కిపోయాయి. కోగంటివారిపాలెం భూములకు రూ.9 లక్షలు, రూమ్ అద్దెల ద్వారా రూ. 2లక్షలు ఆదాయం వస్తుంది. దీంతో సత్రం ఉద్యోగులకు కూడా జీతాలు అందడం లేదు. దీంతో అమరేశ్వరాలయానికి సత్రాన్ని దత్తత తీసుకోవడం ఎందుకని పిటిషనర్ ప్రశ్నించడంతో దానిని దత్తత నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

వరలక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలి

- అవయవదానం చేసిన ఆమెకు ఘన నివాళులర్పించిన అధికారులు



వరలక్ష్మి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో పి.గ్లోరియా, డాక్టర్ ఎస్.విజయమ్మ, షేక్ సలీమా, డాక్టర్ సాయిబాబు

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అవయవదానం ద్వారా కొపనాతి వరలక్ష్మి (45) అమరత్వం పొందింది. ఆమె మరణించినా, మన మధ్యనే జీవిస్తూ ఉంటుంది. ఆమె ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు దానం చేయటం ద్వారా మరో ముగ్గురి జీవితాల్లోవెలుగులు నింపింది. ఆమె భర్త వీరకుమార్, మామయ్య నరసింహారావు ఉదాత్తమైన నిర్ణయం తీసుకున్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని బ్రెయిడ్‌డెడ్ సంభవించిన పరిస్థితులలో అందరూ అవయవదానానికి ముందుకురావాలని పలువురు కోరారు. బాపట్ల పట్టణంలోని వివేకానంద కాలనీకి చెందిన కొపనాతి వీరకుమార్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గతంలో బాపట్ల మండలం పాండురంగాపురం స్కూల్‌లో పనిచేసిన ఆయన 2017లో బదిలీపై మాచవరం మండలం లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌కు వెళ్లారు. పల్నాడు ప్రాంతంలో నివాసం ఉంటున్న వీరకుమార్ భార్య వరలక్ష్మికి అనారోగ్యం రావటంతో ఆస్పత్రిలో చూయించి వైద్యం చేయిస్తున్నారు. మెదడు సంబంధిత వ్యాధితో ఈ నెల 6న గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో చేరారు. ఆదివారం ఆమె బ్రెయిడ్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. జీవన్‌దాన్ ప్రతినిధులు ఆమె కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించగా వారు అంగీకరించటంతో ఊపిరితిత్తులను సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి, కాలేయం, మూత్రపిండాలను ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు కేటాయించారు. అనంతరం భౌతికకాయాన్ని సోమవారం వివేకానందకాలనీలోని వారి నివాసానికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, తహసీల్దార్ షేక్.సలీమా అక్కడకు చేరుకొని ఆమెకు నివాళులు అర్పించి భర్త వీరకుమార్ దాతృత్వాన్ని అభినందించారు. బాపట్ల జిల్లా శరీర, అవయవ దాతల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీ సీ.సాయిబాబు, సభ్యులు యాజలి భాస్కరరావు, యూటీఎఫ్ నాయకుడు జడ వినయ్‌కుమార్, ఎంఎస్ఎస్ భారతి, ఉదయకుమారి, అడుగుల శ్రీనివాసరావు, నూతలపాటి కోటేశ్వరరావు, శైలజ, సుందరదాసు, నాగరామారావు, ఉదయకుమారి తదితరులు పాల్గొని ఆమె మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ఎమ్మెల్యే సంతాపం...

అవయవదానం చేసి ముగ్గురు ప్రాణాలు నిలబెట్టిన వరలక్ష్మి మరణంలోనూ జీవించే ఉంటారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని అవయవదానం చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు.

రైతు రుణం ఉపశమన చట్టం అమలు చేయాలి

గుంటూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆత్మహత్యలను నివారించేందుకు కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు రుణం ఉపశమన చట్టం' దేశవ్యాప్తంగా అమలు చేయాలని మాజీ మంత్రి, అఖిల భారత రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు చుట్టుగుంట సెంటర్ లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా జరిగిన సభకు రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు అధ్యక్షత వహించారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ మండలి తీసుకున్న నిర్ణయం మేరకు దేశంలోని అన్ని రాష్ట్ర కేంద్రాల్లో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2014 ఎన్నికలకు ముందు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఆ తర్వాత కొద్ది కాలానికి ఈ సిఫార్సులు అమలు చేయడం సాధ్యం కాదని మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది అన్నారు. వ్యవసాయంలో కార్పొరేటీకరణను అనుమతించడానికి జరుగుతున్న కుట్రను రైతులు ఉత్తరాది రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఉద్యమించి నిలువరించారని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధరలు రాలేదన్నారు. తెలంగాణ, కర్ణాటక, కేరళలో రైతులకు కనీసం మద్దతు ధర రాకపోతే ధాన్యానికి బోనస్ ఇస్తున్నారని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గుంటూరు ఛానల్ అభివృద్ధి, వరికపూడిసెల ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేస్తున్న టీడీపీ ప్రభుత్వం రూ.80వేల కోట్లతో బనకచర్ల చేపడతామని చెప్పడం ద్వారా కాంట్రాక్టర్లను బాగు చేయడం కోసమేనన్నారు. ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, సభకు అధ్యక్షత వహించిన సీనియర్ రైతు నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ రైతులకు మద్దతుగా రాకపోతే కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద రైతులను ఆదుకోవాల్సి ఉందన్నారు. కోకో రైస్ సంగం నాయకులు శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు సంగం అధ్యక్షులు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, వివిధ రైతు సంఘాల నాయకులు సి.హెచ్. వెంకటేశ్వర్లు,చుండూరు రంగారావు, నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహన రావు, ఎం హరిబాబు, పి జమలయ్య, వెంకటరెడ్డి, ఆంజనేయులు, ఎం సూర్యనారాయణ. హనుమారెడ్డి, వివిధ రైతు సంఘాల జిల్లా నాయకులు కంచు మాటి అజయ్ కుమార్, ఉల్లిగడ్డ నాగేశ్వరావు, పచ్చల శివాజీ, వేల్పూరి నరసింహారావు, కొల్లి రంగారెడ్డి ఈమని అప్పారావు, బైరగాని శ్రీనివాసరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ షఫ్షి, మెడికల్ యూనియన్ రాష్ట్ర నాయకులు కుమార్, సలీం తదితరులు ప్రసంగించారు.

జీవ ఇంధనమే భవిష్యత్తు తరాలకు ప్రత్యామ్నాయం

పెదకాకాని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జియో ఇంధనమే భవిష్యత్తు తరాలకు ప్రత్యామ్నాయమని, గ్రీన్ ఎనర్జీపై అందరికీ అవగాహన ఉండాలని ఐఐఎమ్ నాగపూర్ కు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ గ్రీన్ ఎనర్జీ వ్యవస్థాపకులు వైభవ్ డాంగే పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలో భారత ఆర్థిక వ్యవస్థలో బయో ఫ్యూఎల్, గ్రీన్ ఎనర్జీ ప్రభావంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైభవ్ డాంగే మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థపై వీటి ప్రభావం ఎలా ఉంటుందో అనే అంశాలపై ఈ సమావేశంలో ఆయన చర్చించారు. కామర్స్, వ్యాపార నిర్వహణ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ ఈ సదస్సుకు సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ ప్రవేశాల విభాగం సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణకు జీవ ఇంధనం ఎంతలా పడుతుందో వివరించి, వందన సమర్పణ చేశారు. గౌరవ అతిథులుగా ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రచార్యులు ఆచార్య ఎమ్ సురేష్ కుమార్, సైన్స్ కళాశాల ప్రచార్యులు ఆచార్య కె వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఎడ్లజతకు ప్రథమ స్థానం

రాజుపాలెం, మార్చి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులగణపవరం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి 96వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన ఆరుపళ్ల దూడల విభాగంలో మొత్తం 10ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఆరుపళ్ళ దూడల విభాగంలో నిర్ణీత 15 నిమిషాల కాల వ్యవధిలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం అత్తోట శిరీషా శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్లజత 4250 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. విజయవాడకు చెందిన వల్లభనేని మోహనరావు, సూర్యపేట జిల్లా కోదాడ మండలం రామలక్ష్మపురంకు చెందిన ఉత్తం పద్మావతి రెడ్డి కంబైన్స్ ఎడ్లజత 4000 అడుగుల దూరం లాగి రెండో స్థానంలో, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 3783.9 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యజమానులకు రూ. 35 వేలు, రూ. 25వేలు, రూ. 20వేలు నగదు బహుమతితో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.



ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్లజత

జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి

- ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న శాసనసభ్యుడు బ్రహ్మానందరెడ్డి

దుర్గి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని మాచర్ల శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని ముటుకూరులో ఆదివారం రాత్రి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ముటుకూరు తిరునాళ్లకు రాకుండా వైసీపీ రౌడీ మూకలు తనను నిర్బంధించారనీ, ఇప్పుడు విద్యుత్ ప్రభలతో తాను గ్రామాన్ని కనులపండవగా చేశామని అన్నారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని అసమర్థుడు రాష్ట్రానికి న్యాయం చేస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. మాచర్ల నియోజకవర్గంలో అక్రమాలు, అన్యాయాలు చేస్తూ మాపై నిందలు వేయడం మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అమాయకత్వమని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన జరుగుతుందనీ, జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డుకు వచ్చి తుమ్ముతూ ప్రభుత్వంపై నిందలు వేయడం సిగ్గు చేయటని విమర్శించారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురజాల డీఎస్పీ జగదీష్, దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ 200 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ సునీతాశంకర్, లింగా రమేష్, దొండపాటి చెన్నయ్య, గర్నీడి రమేష్, సూరె వెంకటేశ్వర్లు, ఆకుల చెన్నయ్య, జనసేన నేత తోటకూర శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

- తండ్రి, కుమార్తె మృతి

వెల్దుర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మార్జిన్లో ఆగి ఉన్న ట్రాక్టర్ వెనుకగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తండ్రి, కుమార్తె మరణించిన సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తి పెట్రోలు బంకు వద్ద చోటుచేసుకుంది. మండలంలోని మిట్టమీదపల్లెకు చెందిన గోళ్ల శ్రీను (30) తన మూడేళ్ల కుమార్తె రూపతో ద్విచక్ర వాహనంపై సోమవారం మాచర్లకు వచ్చి తిరిగి రాత్రి సమయంలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని వెల్దుర్తి పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే రోడ్డు మార్జిన్లో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుకగా ఢీకొట్టారు. ఈ సంఘటనలో శ్రీను, అతని కుమార్తె రూప అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సమందర్‌వలి సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సమందర్‌వలి చెప్పారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి



రామారావు(ఫైల్)

క్రోసూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసపాడు విద్యుత్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న గుజ్జర్లపూడి రామారావు(50) విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి తరువాత గుండెపోటుతో మరణించారు. ఎలక్ట్రికల్ ఏఈ బసవరాజు తెలిపిన వివరాల ప్రకారం.. రామారావు పీసపాడు పంచాయతీ పరిధిలోని పారుపల్లి గ్రామంలో సోమవారం విద్యుత్ స్తంభం పైకి ఎక్కి కరెంటు పనులు చేస్తున్నారు. ఒక వైరుకు విద్యుత్ ప్రసారమై షాక్‌కు గురయ్యారు. స్తంభం పైనుంచి కింద పడిన ఆయన తీవ్రంగా గాయపడటంతో సత్తెనపల్లికి తరలించే క్రమంలో గుండెపోటుకు గురై మరణించారు. రామారావుది సత్తెనపల్లి కాగా ఆయనకు భార్య, ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే కుమార్తె, కుమారుడు ఉన్నారు. క్రోసూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మంత్రి గొట్టిపాటి ప్రగాఢ సంతాపం

లైన్‌మెన్ గుజ్జర్లపూడి రామారావు మరణించటంపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రామారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 522.90 అడుగులు ఉంది. ఇది 154.61 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8986, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 15,288, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 34,377 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

14న మండల పరిషత్ సమావేశం

పిడుగురాళ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగనున్నదని ఎంపిడిఓ సిహెచ్ రామచంద్రరావు తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఈనెల 13న జాబ్‌మేళా

మాచర్లటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్, సీడాప్ ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. ఈజాబ్‌మేళాలో కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఫాక్స్‌కాన్, రినిఇవ్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, ఇన్నోవ్‌సోర్స్ వంటి కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లోమా, ఫార్మసీ, పీజీ విద్యనభ్యసించిన వారు అర్హులన్నారు. వయసు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. వివరాలకు 7842747682, 9010585360 నంబర్లను సంప్రదించాలన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన అమరావతిలోని పట్నం ఎస్సీ కాలనీలోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థులు, అంబేద్కర్ సేవాసమితి సభ్యులు, అభిమానులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఘనంగా ఆవిష్కరించారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతుడు కావాలని ఆకాంక్షతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాకులు ఈ సందర్భంగా తెలిపారు.

అన్నప్రసాదం పంపిణీ

కారంపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం నిర్వహించిన పీఎంఎస్ఎం కార్యక్రమానికి వచ్చిన గర్భిణులకు పలువురు దాతలు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆశం నరసింహారెడ్డి, లీలావతి దంపతులు, జడ్డు లక్ష్మారెడ్డి, పద్మ దంపతులు, భవిరిశెట్టి రామారావు, సీతామహాలక్ష్మి దంపతులు ఈ సేవా కార్యక్రమానికి సహకారం అందించారు. కార్యక్రమంలో వైద్యులు రమ్య, లక్ష్మీమౌనిక, సీహెచ్‌వో మల్లయ్య, హెచ్‌వి వెంకటమణి, హెల్త్ అసిస్టెంట్ లాలునాయక్, చిన్ని లక్ష్మి, కందుకూరి దేవి, బొగ్గారపు పార్వతి, అనంతలక్ష్మి, గుండా ప్రసన్న, పల్లా పద్మ, భానుతజ, గురువర్ధని తదితరులు పాల్గొన్నారు.

14న స్వామి వారి కల్యాణోత్సవం

మాచవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగరాయపాలెం తండా గ్రామ సమీపంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత సింగరుట్ల లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 14న నిర్వహించనున్నట్టు దేవాలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సత్తెనపల్లి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధించాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెద మక్కెన జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సోమవారం పరీక్షా సామాగ్రిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పరీక్షా సామాగ్రి అందించిన నెల్లూరి యశ్వంత్ కుమార్, సాయి తేజశ్వనిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మందడపు సాంబశివరావు, నెల్లూరి యశ్వంత్ కుమార్, లింగయ్య, హెచ్ఎం వెంకటరావు, వేణు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారిద్దాం..

రెంటచింతల,మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించ వచ్చని టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు జీఎం శ్రీనివాస్ తెలిపారు. జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉద్యోగులు, కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రమాదాలు, వృత్తిపరమైన వ్యాధులు దేశ ఆర్థిక వ్యవస్థను కుంటుపరుస్తాయని, అంగవైకల్యం ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

జూదరులు కోర్టుకు హాజరు

మాచర్లరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో పేకాట కేసులో అరెస్టయిన ముగ్గురుని సోమవారం మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచినట్లు విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి తెలిపారు. విజయపురిసౌత్ లోని సీటైపునకు చెందిన ముగ్గురిని పేకాట ఆడుతుండగా పట్టుకుని, వారి నుంచి రూ. 3580 స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్య

నకరికల్లు మార్చి 10 ఆంధ్రజ్యోతి: నకరికల్లు మండలం కుంకలగుంట శివారు పాపిశెట్టిపాలెం గ్రామంలో షేక్ దూదేకుల ఫాతిమా బేగం అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తుంది. ఆమె భర్త షేక్ దూదేకుల సైదా వలి గుంటూరులో మెకానిక్‌గా పని చేస్తూంటాడు. కొన్ని రోజులుగా పాపిశెట్టి పాలెం గ్రామానికి చెందిన పాతలావతు బాలకృష్ణనాయక్, బాల్‌సింగ్ నాయక్ లు ఫాతిమాబేగంపై అధికారులకు ఫిర్యాదులు చేస్తామని బెదిరిస్తుండటంతో మనస్థాపానికి గురైన ఆమె ఆదివారం గడ్డి మందు తాగింది. గమనించిన స్థానికులు ఆమెను నరసరావు పేట వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఫాతిమా సోమవారం మృతి చెందింది. ఫాతిమ భర్త సైదావలి ఫిర్యాదు మేరకు నకరికల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిధులు నిరుపయోగం

- నాడు - నేడు పనుల్లో తీవ్ర జాప్యం
- ఏళ్ల తరబడిగా అరకొర పనులతో సరి
- పనికిరాకుండా పోతున్న నిర్మాణ సామగ్రి
- వృథా అవుతున్న ప్రజా ధనం
- అధికారుల అలసత్వం, అవినీతే కారణమా?




సమాధానంపేట పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గది, పగిలిపోయిన నాపరాళ్లు

గురజాలటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల ఆధునికీకరణ పనుల నిమిత్తం మంజూరైన నిధులు నిరుయోగమవుతున్నాయి. పాఠశాలల్లో పనులు పూర్తి స్థాయిలో జరగక పోవడంతో కొనుగోలు చేసిన సామగ్రి పనికి రాకుండా పోతోంది. అధికారుల అలసత్వం, సిబ్బంది అవినీతి ప్రభుత్వ బడులకు శాంపగా మారుతోది. దీంతో నేడు - నేడు కింద పాఠశాలల అభివృద్ధికి విడుదలైన నిధులు బూడిదలో పోసినట్లయింది. దీంతో అరకొర పనులతో పాఠశాలల భవనాలు దర్శనమిస్తున్నాయి.

గురజాల మండల పరిధిలో నాడు-నేడు పథకం కింద పలు పాఠశాలల ఆధునికీకరణ పనులను గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. ఇందుకోసం లక్షలాది రూపాయల నిధులును ప్రభుత్వం కేటాయించింది. మండలంలోని సమాధానంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి 2022లో రూ. 66 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు పాఠశాలలో పలు వసతులు సమకూర్చుకోవాల్సి ఉంది. కాగా ఈ నిధుల్లో మొదటి విడతగా రూ. 12.50 లక్షలు డ్రా చేశారు. వీటితో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు కావాల్సిన సిమెంట్ బస్తాలు, ఇనుపు, టైల్స్, నాపరాయి తదితర సామగ్రిని కొనుగోలు చేశారు. అయితే అప్పటి పాఠశాల హెచ్ఎం రఘు ఈ నిధుల్లో రూ. 2 లక్షలు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో అదే యేడాది డిసెంబర్‌లో రఘును విద్యాశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కాగా ఆయన అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో అతని కుటుంబసభ్యులు ఆ రూ. 2 లక్షలను పాఠశాలకు ఇచ్చేశారు. అయితే సుమారు 350 సిమెంట్ బస్తాలు గడ్డకట్టిపోయాయి. ఇనుపు తుప్పపట్టి పోయింది. టైల్స్ చాలా వరకు పనికిరాకుండా పోయాయి. నాపరాయి స్కూల్ ఆవరణలోనే నిరూపయోగంగా పడి ఉంది. తదుపరి ఇన్‌చార్జి హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టిన మస్తాన్‌వలి మరో రూ. 9.50 లక్షలు డ్రా చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. తదుపరి ఎన్నికల కోడ్ రావడంతో నిధులు నిలిచిపోయాయి. దీంతో తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.



వంటగది ఏర్పాటుకు రూ. 15 లక్షలు..

గురజాల పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వంట గది నిర్మాణానికి నాడు - నేడు కింద 2023లో రూ. 15 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో రూ. 5 లక్షలు డ్రా చేసి వంట గది నిర్మాణానికి అవసరమైన సిమెంట్ బస్తాలు, టైల్స్ కొనుగోలు చేశారు. అయితే నిర్మాణం చేపట్టినప్పటికీ పూర్తి కాలేదు. అసంపూర్తిగా నిలిచిపోయింది. సుమారు 60 సిమెంట్ బస్తాలు గడ్డకట్టిపోయాయి. టైల్స్ పనికిరాకుండా పోయాయి. ఉద్యోగుల అలసత్వం, అధికారుల పర్యవేక్షణలోపంతో విద్యార్థులకు అందాల్సిన మెరుగైన వసతులు దూరమయ్యాయి. ఇలా మండల పరిధిలో చాలా చోట్ల పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.



గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు

సమయం ఎంతో విలువైంది

- శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి
- పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత



విద్యార్థికి పరీక్షా సామగ్రిని అందజేస్తున్న మంజులారెడ్డి

రెంటచింతల,మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమయం ఎంతో విలువైందని, పరీక్షల వేళ ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిల్పారామం చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి పదో తరగతి విద్యార్థులకు సూచించారు. సోమవారం ఆమె రెంటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతిని దాటడం విద్యార్థికి విజయానికి తొలిమెట్టని అన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వపరంగా ప్రత్యేక చొరవతో విద్యా ప్రణాళికను రూపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి వరుసగా మూడు బహుమతులు అందచేస్తానని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెన్నా బిచ్చిరెడ్డి, లింగారెడ్డి, సుబ్బారావు, సాగర్‌బాబు, టీడీపీకి చెందిన చేరెడ్డి కోటిరెడ్డి,సర్వారెడ్డి,వెన్నా కృష్ణారెడ్డి, సుంకయ్య, కొత్త ఆంజనేయులు, జడ్డా కృష్ణారెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంతెన పైనుంచి పడి వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

రెంటచింతల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారు మండలంలో పాలువాయిగేట్ వంతెనపై నుంచి కింద పడటంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం వేకువ జామున జరిగింది. గోలి గ్రామానికి చెందిన మాచవరపు నాగేశ్వరరావు, బాలగాని అమరాంజనేయులు దుర్గి మండలం ముటుకూరు గ్రామ తిరునాళ్లకు వెళ్లి వస్తుండగా వేకువ జామున 3 గంటల 30 నిమిషాల సమయంలో రైల్వే వంతన నుంచి కింద పడిపోయారు. సుమారు మూడు గంటల పాటు అచేతనంగా తీవ్ర గాయాలతో ఉన్న వారిని బహిర్భూమికి వెళ్ళేవారు గమనించి గ్రామస్థులకు సమాచారమిచ్చారు.అనంతరం వారిని మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి నరసరావుపేటకు తరలిస్తున్న సమయంలో మాచవరపు నాగేశ్వరరావు(40) మృతి చెందాడు. అమరామాంజనేయులను గుంటూరు లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నాగేశ్వరరావుకు భార్య ఏసమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు

మాచర్లటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యం ఘటనపై మాచర్ల పట్టణ పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం యర్రబాలెంకు చెందిన గంధం వెంకటరమణ తన భర్త రామయ్యతో కలిసి ఈనెల 8న రాత్రి 9గంటలకు మాచర్ల పట్టణంలోని తన సోదరుడైన వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు వీఆర్వో సాతాని కొండలరావు ఇంటికి వెళ్లారు. అక్కడ వెంకటరమణను వదిలి రామయ్య తిరిగి వెళ్లిపోయాడు. అయితే మరుసటి రోజు రామయ్య బావమరిది కొండలరావు ఫోన్‌చేసి అక్క ఇంటికి రాలేదని రామయ్యకి చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు, బంధువులను విచారిరంచినా ఆచూకీ లేకపోవడంతో సోమవారం వీఆర్వో కొండలరావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యం, ఆదాయం

- జిల్లా అదనపు మేనేజర్ ప్రేమ్ రాజ్

నకరికల్లు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యం, ఆదాయాన్నిస్తుందని ప్రకృతి సాగు జిల్లా అదనపు మేనేజర్ ప్రేమ్‌రాజ్ అన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయ శాఖ అనుబంధల శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి రైతు వారి పొలంలో ఖరీఫ్ సీజన్‌కు ముందు నవధాన్యాలను చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కే దేవదాసు, వీవోఏలు, వీఏఏలు, అప్పలరాజు, బాజీబాబు, రవికుమార్, హసీనా, రామసుబ్బారెడ్డి, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మృతి

నకరికల్లు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చీమలమర్రి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నల్లగట్ల ఆదెమ్మ(79) మృతి చెందగా సోమవారం ఆమె భౌతిక కాయాన్ని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

సత్తెనపల్లి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ ఆర్థిక సహకారంతో మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి నెల గర్భిణీలకు పౌష్టికాహారం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులను ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, గర్భిణీలు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో ఐదు అర్జీలు

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి) సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఐదు అర్జీలు అందినట్లు తహసీల్దార్ దానియేలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల్లోనే ఆ అర్జీలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో రైతుల ఫిర్యాదు

దాచేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేపై ఆరోపణలు చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో దాచేపల్లి నుంచి 2, కేసానుపల్లి నుంచి ఒకటి, మాదినపాడు నుంచి 2 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వై కుటుంబరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కమిషనర్ అప్పారావు, వ్యవసాయ శాఖ ఏవో పాప కుమారి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ దేశాయ్, ఆర్ఐ శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరిస్తాం

కారంపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరిస్తామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన ప్రజల నుంచి మూడు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొలాల్లో నవధాన్యాలు చల్లాలి

ముప్పాళ్ళ మార్చి10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగులో భాగంగా ప్రతి రైతు ఖరీఫ్‌కు ముందు వారి పొలంలో నవధాన్యాలను చల్లుకోవాలని ఏవో అరుణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నందకుమార్‌లు సూచించారు. నార్నెపాడు రైతుసేవ కేంద్రంలో సోమవారం వ్యవసాయ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ అనుబంధ శాఖల సమావేశం నిర్వహించారు. నవ ధాన్యాలు చల్లడం వలన భూమి సారవంతమౌతుందని తెలిపారు. సమావేశం లో సౌజన్య లక్ష్మీ, స్వాతి, డివిజన్ మాస్టర్ ట్రైనర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



ములకలూరు మేజర్‌ను పరిశీలిస్తున్న ఎన్ఎస్పీ ఏఈఈ తమ్మిశెట్టి రామకృష్ణారావు, రైతులు

పొలాలకు నీరందటం లేదు

- ఎన్ఎస్పీ అధికారులకు రైతుల ఫిర్యాదు

ముప్పాళ్ళమార్చి10(ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు సరిపడా నీరు రావడంలేదని ములకలూరు మేజర్ పరిధిలోని రైతులు సోమవారం ఎన్ఎస్పీ అధికారులకు తెలియజేశారు. దీంతో వోఅండ్ఎం సెక్షన్-2 ముప్పాళ్ళ ఏఈ తమ్మిశెట్టి రామకృష్ణారావు రైతులతో కలిసి ములకలూరు మేజర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 1500 క్యూసెక్కులు విడుదవుతోందని, 1800 లేదా 2000 క్యూసెక్కులకు పెంచితే అన్ని మేజర్‌లకు నీరు సరిపోతుందని, ఈ విషయాన్ని ఉన్నతాదికారులకు తెలియజేసి నీటి విడుదలను పెంచేలా కృషి చేస్తామని రైతులకు ఏఈ తెలిపారు. ఆయనతో వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శంకరరావు, ఎన్ఎంఆర్ లస్కర్‌లు కె.రాంప్రసాద్, జి, రాఘవేంద్ర, పమిడిపాడు గ్రామ రైతులు ఉన్నారు.

పాఠశాలకు కూలర్లు అందజేత

పెదకూరపాడు, మార్చి10(ఆంధ్రజ్యోతి) మండలంలోని 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి జీ శివ సుందరరెడ్డి సోదరుడు శివారెడ్డి మూడు ఎయిర్ కూలర్లను అందించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ పరీక్షల సమయంలో చదువుకోవడానికి 10వతరగతి విద్యార్థులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే కూలర్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.శ్రీనివాసరెడ్డి, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణను అలవర్చుకోవాలి

దుర్గి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎంఈవో బెంజిమెన్ అన్నారు. సోమవారం స్థానిక జడ్పీహైస్కూల్లో పీఎంశ్రీయోజన పథకంలో భాగంగా నూతనంగా స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఎంఈవో బెంజిమెన్ ప్రారంభించారు. బాలురకు కన్నెగంటి హనుమంతు స్కౌట్ ట్రూపు, బాలికలకు రాణి రుద్రమదేవి గైడ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటేశ్వరమ్మ, విజయరాణి, పిడిబండ్ల ప్రసాద్, పద్మావతి, సుకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానవతా మూర్తి సావిత్రి బాయి పూలే

- టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

అచ్చంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మహిళల హక్కుల కోసం పాటుపడిన మానవతా మూర్తి సావిత్రి బాయిపూలే అని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో టీడీపీ బీసీ నేత తిరువాయిపాటి ఆంజనేయులు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ ఈ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రి బాయిపూలే అని, విద్యతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని నమ్మి మహిళా విద్యను ప్రోత్సహించారన్నారు. మూఢ విశ్వాసాలను, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడారని, ఆమె జీవితం మహిళలకు, విద్యార్థినులకు ఎంతో ఆదర్శమన్నారు. ముందుగా సావిత్రి బాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొన్నెకంటి శివయ్య, తాడిబోయిన కృష్ణమ్మ, రాయిడి సాంబశివుడు, ఎస్‌కే కాసుల, ఎస్ గాంధీ, ముసులూరి ఏడుకొండలు, జువ్వా రామారావు, కిరణ్, వెంకటరావు, మేకల హనుమయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్సీలుగా ఎంపికైన బీద రవిచంద్ర, బీటి నాయుడులను అభినందిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖరరెడ్డి

ఎమ్మెల్సీలకు ఎమ్మెల్యే యరపతినేని అభినందన

పిడుగురాళ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా ఎంపికైన బీద రవిచంద్ర, బీటీనాయుడు, కావలి గ్రీష్మలను సోమవారం అసెంబ్లీ ఆవరణలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కలిసి అభినందలను తెలియజేశారు. ఈసందర్భంగా యరపతినేని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బడుగు బలహీనవర్గాలకు ఇస్తున్న ప్రాధాన్యానికి ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ఒక నిదర్శనమని అన్నారు. మూడు స్థానాల్లో రెండు బీసీ, ఒకటి ఎస్సీకి కేటాయించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామాజిక సమతుల్యతను పాటించార న్నారు. నూతనంగా ఎంపికైన ఎమ్మెల్సీలు పార్టీకి, నియోజకవర్గాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే యరపతినేనితో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా ఉన్నారు.

సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా

- సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

ఫటా ఫట్



సత్తెనపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు సీసీ కెమేరాలను ఉపయోగిస్తున్నట్టు సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలు జరగకుండా గ్రామాలతో పాటు పట్టణాల్లో సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమేరాల ఏర్పాటుతో నేరాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపారు. సోమవారం ఆయనతో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ..

● సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో ఎన్ని సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు?

సత్తెనపల్లి పట్టణం, మండలం, రాజుపాలెం, ముప్పాళ్ళ, నకరికల్లు, క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు, అమరావతి మండలాల్లోని పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఇప్పటి వరకు 600 సీసీ కెమేరాలు ఏర్పాటు చేయించాం.

● డ్రోన్ కెమేరాలు ఎన్ని ఉన్నాయి?

సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఐదు డ్రోన్ కెమేరాలు ఉన్నాయి. జనం గుంపులు గుంపులుగా గుమ్మికూడినప్పుడు, బహిరంగ సమావేశాలు, ఆందోళనలు జరిగినప్పుడు డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తాం.

రౌడీ షీటర్ల కదలికలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

సబ్ డివిజన్ పరిధిలో 380 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరితో పాటు మాజీ రౌడీ షీటర్లపై కూడా నిఘా నిరంతరం నిఘా పెడుతున్నాం.

వడ్డీ వ్యాపారుల వేధింపులపై పై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

హెల్మెట్‌ల వాడకంపై ప్రజలకు ఎటువంటి అవగాహన కల్పిస్తున్నారు?

హెల్మెట్‌ల వాడకం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. జరిమానాలు విధిస్తున్నాం. బహిరంగంగా మద్యం తాగటం, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై అపరాధ రుసుం విధిస్తున్నాం. సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 500 మంది పై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించాం.



దాచేపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

- అక్రమ విద్యుత్ వాడకందారులకు రూ 3.70 లక్షలు అపరాధ రుసుం

దాచేపల్లి, మార్చి10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పల్నాడుజిల్లా పర్యవేక్షక ఇంజనీరు పి.విజయ కుమార్ ఆధ్వర్యంలో 49 మంది అధికారులు, 183 మంది సిబ్బంది 49 బృందాలుగా ఏర్పడి దాచేపల్లి పట్టణంలో 4754 సర్వీస్ మీటర్లను తనిఖీ చేశారు. మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ వాడుతున్న ఇద్దరికి రూ.లక్ష, ఇతర క్యాటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఒకరికి రూ.20 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 65 మందికి రూ 2.50 లక్షలు అపరాధ రుసుం విధించామన్నారు. కార్యక్రమంలో ఈఈ సీహెచ్ వెంకటేశ్వర రావు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ఎన్ సింగయ్య, దాచేపల్లి డీఈఈలు కె.రవికుమార్, వీరేశ్వరరావు, కోటేశ్వరరావు, చంద్రశేఖర్, ఏఈ భగవాన్ పాల్గొన్నారు.



అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన విద్యార్థుల డ్రామా ప్రదర్శన

హైస్కూలు విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు

దుర్గి,మార్చి10(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఓబులేశునిపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖలో భాగమైన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటారని హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. విశ్వజన్‌రగ్ - 2025 ఉత్సవాల్లో భాగంగా పంచమ వేద నాటికను ప్రదర్శించి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకు పంపగా, దానికి అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందిందన్నారు. ఇందుకుగాను విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఆవిద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందరి, అంజనీకుమార్, లోహిత్‌రెడ్డి, ఆదిత్య, శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా రూపెనగుంట్ల తిరునాళ్ల

నకరికల్లు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రూపెనగుంట్లలో ఉన్న ఆంజనేయ స్వామి తిరునాళ్ళను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహిళలు దేవాలయ ప్రాంగణంలో పొంగళ్ళు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఏకాహం నిర్వహించారు. ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. నాలుగు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రూపెనగుంట్ల ప్రధాన వీధులన్నీ కిక్కిరిశాయి. పూజా కార్యక్రమాలను నారాయణం మోహన కృష్ణమాచార్యులు, తాండవ కృష్ణమాచార్యులు, గోపాలకృష్ణమాచార్యులు తదితరులు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

'పది' విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

కోసూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం జడ్పీ హైస్కూల్లో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు హెల్ప్ ఫౌండేషన్ వారు పరీక్షా సామగ్రిని అందజేశారు. అలాగే సావిత్రి బాయిపూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధి కంచర్ల బుల్లిబాబు, హెచ్ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు మస్తాన్, సత్తెనపల్లి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, నాగమల్లేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకలి కేకలు



■ ఉన్నతాధికారి రూటే సపరేటు

గుంటూరు

నగరం నడిబొడ్డున ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లి రెండు రోజులు నిర్బంధించినా పట్టించు కోరు... జిల్లా అత్యున్నత అధికారులు నివాసం ఉండే బంగ్లాల సమీపంలోని హాస్టల్లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చినా... అధికారులు కళ్లు తెరవరు... మరోవైపు హాస్టల్స్ లో నాణ్యతలేని భోజనం తినలేక విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నా స్పందించరు.. ఇదీ నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో నెలకొన్న దయనీయ పరిస్థితులు.

- ఎస్సీ కళాశాల హాస్టల్స్‌లో నాణ్యతలేని భోజనం
- రైస్ కుక్కర్లతో విద్యార్థులే వండుకుంటున్న వైనం
- కొందరికి అన్న క్యాంటీనే ఆధారం
- బోగస్ హాజరుతో అక్రమాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

గుంటూరు (విద్య) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ రోడ్డులోని (రమేష్ ఆస్పత్రి పక్కన), హయ్యర్ హాల్ కాంపౌండ్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండు కళాశాల హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. మొదటి హాస్టల్‌లో 200 మంది, రెండో హాస్టల్లో 198 మంది ఎస్సీ విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు నగరంలోని కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ హాస్టల్స్‌లో కొంత కాలంగా భోజనం సక్రమంగా అందడం లేదు. దొడ్డు బియ్యంతో తయారు చేసిన చిమిడి పోయిన అన్నం, నాణ్యతలేని కూరలు వడ్డిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా నిత్యం ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో కొంతమంది విద్యార్థులు హాస్టల్ భోజనం తినలేక రైస్ కుక్కర్లను హాస్టల్స్‌కు తీసుకువచ్చి భోజనం వండుకుని కర్రీ పాయింట్స్ నుంచి కూరలు తెచ్చుకుని తింటూ కాలం వెళ్లదీస్తున్నారు. నగరం నడిబొడ్డున సాక్షాత్తూ జిల్లా అత్యున్నత అధికారుల కార్యాలయం రోడ్డులోనే ఈ తంతు జరుగుతున్నా, సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు.

బోగస్ హాజరుతో నిధుల స్వాహా

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రెండు హాస్టల్స్‌లో ఉన్న ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 1600 వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇలా నెలకు రూ. 7 లక్షలపైగా మెనూ చార్జీల కింద, ఇతర నిర్వహణ చార్జీల కింద మరో రూ. 1.50 లక్షల చెల్లిస్తున్నారు. వాస్తవంగా ఉన్న విద్యార్థుల హాజరు కంటే ఎక్కువ చూపి బోగస్ హాజరు నమోదు చేసి నెలకు లక్షల్లో బిల్లులు పెడుతున్నారు. వచ్చిన సొమ్ములో ఉన్నతాధికారికి వాటాలు పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇటీవల ఏఎస్‌డ బ్ల్యూవో బహిర్గతమైంది. సదరు అధికారి పరిశీలనకు వెళ్లిన సమయంలో రైస్ కుక్కర్లో విద్యార్థులు అన్నం వండుకుంటూ కనిపించారు. మరోవైపు కొంతమంది విద్యార్థులు సమీపంలోని హిందూ కళాశాల వద్ద ఉన్న అన్న క్యాంటీన్లో భోజనం, అల్పాహారం చేస్తున్నట్లు గుర్తించి ఆ అధికారి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా సమగ్ర నివేదిక అందజేసినా చర్యలు మాత్రం శూన్యం. కళాశాల హాస్టల్ వార్డెన్లు భారీ మొత్తంలో పైస్థాయిలో ఓ అధికారికి ముడుపులు చెల్లిస్తున్నారనీ, అందుకే వారిపై ఈగ వాలనీయడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.



ఓ గదిలో సామాన్లతోపాటు ఉన్న రైస్ కుక్కర్

ఆరోపణలు ఉన్న వెల్ఫేర్ ఆఫీసర్‌కు కీలక పోస్టు...

హయ్యర్‌హాల్ హాస్టల్‌లో పనిచేసే ఓ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌పై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. గుంటూరుతో పాటు, బాపట్ల, పల్నాడు ప్రాంతాల్లో పనిచేసిన ఆయన ప్రతిచోట అక్రమాలకు, విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు సస్పెండ్ అయినా తీరుమార లేదని ఆశాఖలో సిబ్బందే చెబుతున్నారు. గతంలో జడ్పీలో పనిచేసిన ఓ కీలకమైన అధికారి బంధువైన మహిళను వేధించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఇన్ని ఆరోపణలు ఉన్నా, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు కీలక మైన హాస్టల్‌లో పోస్టింగ్ ఇచ్చారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఉన్నతాధికారి రూటే సపరేటు

సాంఘిక సంక్షేమ శాఖలో ఓ అత్యున్నత అధికారి రూటే సపరేటు అన్నచందంగా సాగుతోంది. ఆయన జిల్లాకు వచ్చి ఐదు సంవత్సరాలు దాటింది. ఆయనపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకంలో అక్రమాలు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల్లో భారీ వసూళ్లు, కీలకమైన పోస్టింగ్ విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో ఇటీవల చోటు చేసుకున్న వరుస సంఘటనలపై కూడా చర్యలు లేవని చెబుతున్నారు.

అస్తవ్యస్తంగా హాస్టల్స్

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వలన సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్ అస్తవ్యస్తంగా మారాయి.

- ఏడాది క్రితం జూట్‌మిల్లు సమీపంలోనే విద్యార్థినుల కళాశాల హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని వైసీపీ కార్యకర్తలు కిడ్నాప్ చేసి రెండు రోజులు నిర్బంధించారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో ఇప్పటి వరకు తెలియదు.
- ఆర్నెల్లు క్రితం సాక్షాత్తూ కలెక్టర్, ఎస్పీ, ఐజీ బంగ్లాల రోడ్డులో ఉండే ఓ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చినా ఆ విషయం ఎనిమిది నెలల వరకు అధికారులకు తెలియలేదంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అవగతం చేసుకోవచ్చు.
- కలెక్టర్ బంగ్లా రోడ్డులోనే రెండు హాస్టల్స్‌లో నిత్యం విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చివరకు విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో ఓ అధికారి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా చర్యలు లేవు. దీనికితోడు నివేదిక ఇచ్చిన అధికారిపైనే సదరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఎదురుదాడికి దిగి ఆరోపణలు చేస్తున్నారు. దీనికి సాంఘిక సంక్షేమ శాఖలోని ఓ ఉన్నతాధికారి వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



ఇంటి నుంచి తెచ్చుకున్న రైస్ కుక్కర్ చూపుతున్న విద్యార్థి

చిన్న శేష వాహనంపై ఊరేగిన శ్రీవారు



శేష వాహనంపై దర్శనమిచ్చిన నృసింహస్వామి

మంగళగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి సోమవారం ఉదయం చిన్న శేష వాహనంపై పురవీధుల్లో విహ రించారు. ఈ ఉత్సవానికి మంగళగిరి పట్టణానికి చెందిన దేవతి భగవన్నారాయణ, పద్మజ దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. స్వామివారు సోమవారం రాత్రి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం మాడవీధుల్లో విహరించిన అనంతరం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు గ్రామోత్సవం సాగింది. ఈ ఉత్సవానికి మాల్యవంతం వెంకట కృష్ణమాచార్యులు జ్ఞాపకార్థం ఆయన మనుమలు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటి రెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్ల భక్త బృందం కమిటీ ట్రస్టు ఆధ్వర్యంలో మిద్దె సెంటర్లోని శ్రీప్రపత్తి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

దుగ్గిరాల యార్డుకు కొత్త పసుపు కళ

- క్వింటాల్‌కు రూ.11,111 పలికిన ధర



దుగ్గిరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డు సోమవారం కొత్తపసుపుతో కళకళలాడింది. మహిళా హమాలీలు కాటాలకు పసుపు, కుంకుమలు పెట్టి పూజ చేసిన అనంతరం వేలం ప్రారంభించారు. డీడీ ఎన్ శ్రీనివాసరావు, పలువురు వ్యాపారులు పూజ కార్యక్రమానంతరం వేలంలో పాల్గొన్నారు. ఏటా మార్చి నెలాఖరులో వచ్చే కొత్తపంట ఈఏడాది 10వ తేదీనే రావడంతో రైతుల్లో ధరపై ఆశలు రేకెత్తుతున్నాయి. వారం రోజు లుగా క్వింటాల్ పసుపు రూ.10వేల లోపు ధర పలుకుతుండగా సోమవారం వచ్చిన కొత్తపసుపు క్వింటాల్‌కు రూ.11,111 ధర పలకడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేలంలో 288 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ము లు, కాయ ఒకేధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్టధర రూ.8,000, గరిష్టధర రూ.11,111, మోడల్‌ధర రూ.10,601 పలికాయి.



యార్డులో పూజలు జరుపుతున్న మహిళా హమాలీలు

మహిళా సాధికారతకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల సాధికారత కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం జీటీ రోడ్డులోని ఐటీఏ కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం -2025 నిర్వహించింది. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకోవాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను కూడా అందజేస్తున్నాయన్నారు. బ్యాంకు రీజనల్ హెడ్ ఎస్ జవహర్ మహిళల బహుముఖ పాత్రలను వివరిస్తూ ప్రశంసించారు. అలాగే డాక్టర్ జయలక్ష్మీదేవి బ్యాంకు మహిళా ఉద్యోగులకు, మహిళా పారిశ్రామికవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల స్వయం సమృద్ధి కోసం బ్యాంకులు మరింత సహాయ సహకారాలను పెంచాలని కోరారు. బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు రూ. 150కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కస్టమర్లు, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

బీఈడీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో పది మంది అరెస్టు

- వినుకొండ వివేకానంద కళాశాల కరస్పాండెంట్‌దే కీలకపాత్ర
- ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐ నారాయణస్వామి, వెనుక నిందితులు

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న బీఈడీ పరీక్షలకు సంబంధించి ఈ నెల ఏడున ప్రశ్నపత్రం లీకేజీ ఘటనకు వినుకొండ వివేకానంద కళాశాల కరస్పాండెంట్, చైర్మన్ అయిన సయ్యద్ రఫీక్ అహ్మద్ కీలక సూత్రధారిగా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కేసులో కరస్పాండెంట్ రఫిక్ అహ్మద్‌తో పాటు కళాశాల ప్రిన్సిపల్ ధూపాటి సురేష్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ ధారా స్వర్ణ రాజ్ మరో ఏడుగురు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఏజెంట్లు, విద్యార్థులను అరెస్టు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం మొత్తం మీద ఆరువేల బీఈడీ సీట్లు ఉండగా ఒక నాగార్జున యూనివర్సిటీ పరిధిలోనే ఆరువేల వరకు బీఈడీ సీట్లు ఉన్నాయన్నారు. అంతేకాకుండా ఇక్కడ బీఈడీకి ఆదరణ తగ్గడంతో పాటు ఒడిశాలో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలో ప్రవేశం కోసం ఎగబడుతున్నారు. దీంతో ఒడిశాకు చెందిన కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఏజెంట్లుగా మారి ఇక్కడ ఒడిశా విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తున్నారు. ఆయా విద్యార్థుల వద్ద లక్ష నుంచి లక్షన్నర వరకు ఏజెంట్లు వసూలు చేస్తున్నారు. ఇక్కడ కళాశాల యాజమాన్యాలకు రూ. 70 వేల వరకు చెల్లిస్తున్నారు. ఆయా విద్యార్థులకు అక్కడే తరగతులు నిర్వహిస్తూ ఇక్కడ మాత్రం పరీక్షలు రాయిస్తున్నారు. ఈ క్రమంలో సయ్యద్ రఫిక్ అహ్మద్ వినుకొండలో శ్రీ వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, నవ్య చైతన్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, అమరావతిలో ఆజాద్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తుండగా ఆయన కూతురు పేరుతో వినుకొండలో ఆలీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తున్నారు. రఫిక్ అహ్మద్ నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలలో ఎక్కువ మంది ఒరిశా విద్యార్థులు ప్రవేశం పొందారు. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్స రంలోనూ ఒడిశా నుంచి ఎక్కువమంది విద్యార్థులు తమ కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు గాను ఆయా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడం, అదేవిధంగా ఆయా ఏజెంట్లను సంతృప్తి పరచడం కోసం బీడీ ప్రశ్నపత్రాలను లీకేజ్ చేసేందుకు రఫిక్ అహ్మద్ పథకం రూపొందించాడని ఎస్పీ తెలిపారు. అదే సమయంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయం కూడా రఫిక్ అహ్మద్‌కు కలిసి వచ్చింది. సాధారణంగా రెండు, మూడు రకాల ప్రశ్నపత్రాలను తయారుచేసి వాటికి ప్రత్యేకంగా కోడ్ ఇచ్చి సీల్ వేసి సంబంధిత పరీక్షా కేంద్రాలకు పంపుతారు. ఐదు నిమిషాల ముందు ఏ కోడ్ పేపర్ విద్యార్థులకు ఇవ్వాలనేది యూనివర్సిటీ ఉన్నతాధికారులు సమాచారం ఇస్తారు. దీంతో ప్రశ్నపత్రాల లీకేజ్‌కి దాదాపు అవకాశం ఉండదు. అయితే ఈ దఫా ప్రశ్నపత్రాలను పీడీఎఫ్ రూపంలో సీడీలలో ముందుగానే కళాశాలకు పంపారు. పరీక్షకు 40 నిమిషాల ముందుగా ఆయా సీడీలకు పాస్‌వర్డ్ తెలియజేశారు. దీంతో ఆయా కళాశాల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ తమకు వచ్చిన సీడీలోని పీడీఎఫ్‌ను పాస్‌వర్డ్ ఉపయోగించి ఓపెన్ చేసుకొని వాటిని ప్రింట్ తీసి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఇవ్వాలని నిర్ణయించారు. కేవలం ప్రశ్న పత్రాల ప్రింటింగ్ ఖర్చు తగ్గుతుందనే దురుద్దేశంతో చేసిన ఈ అనాలోచిత నిర్ణయంతో 40 నిమిషాలకు ముందుగానే ప్రశ్నపత్రం తాలూకా నకళ్లు జిరాక్స్ సెంటర్లలో దర్శనమిచ్చాయి. ఈ క్రమంలో ఈ నెల 7న జరగాల్సిన పర్స్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్మెంట్ పరీక్షకు సంబంధించిన సీడీని వినుకొండలోని వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ రఫిక్ అహ్మద్ తన కళాశాల కంప్యూటర్ ఆపరేటర్ అయిన ధార స్వర్ణరాజ్‌కు ఇచ్చారు. ప్రిన్సిపల్ ధూపాటి సురేష్ కుమార్, స్వర్ణరాజ్ ఇరువురు కలిసి రెండు గంటలకు జరగాల్సిన పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాన్ని ఒంటిగంటా 21 నిమిషాలకు ఒడిశాకు చెందిన ఏజెంట్ల సెల్‌ఫోన్ వాట్సాప్‌కు పంపారు. ఆయా ఏజెంట్లు తమ విద్యార్థులకు పంపగా వారు ఏకంగా గ్రూపులోనే ప్రశ్నపత్రాన్ని ఫార్వర్డ్ చేశారు. దీంతో పరీక్షకు 40 నిమిషా లకు ముందుగానే బీఈడీ ప్రశ్నాపత్రం వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. ఈ విషయం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లడంతో ఆయన ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విచారణకు ఆదేశించారు. దీనిపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోఆర్డినేటర్ మన్నవ సుబ్బారావు ఫిర్యాదు మేరకు పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకానంద బీఈడీ కళాశాల కరస్పాండెంట్ రఫీక్ అహ్మద్, ప్రిన్సిపల్ సురేష్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ స్వర్ణ రాజ్‌లు ప్రశ్నపత్రాన్ని ఒడిశాకు చెందిన ఏజెంట్లకు పంపారు. ఒడిశాకు చెందిన ఏజెంట్ ధీరేన్ కుమార్ సాహూ దానిని ఒడిశాకు చెందిన విద్యార్థులు ప్రియ భత్రో గౌడయ్, మిలాన్ తృప్తి లకు పంపాడు. దీంతో పోలీసులు ధీరేన్ కుమార్ సెల్‌ఫోన్ వాట్సాప్ ఐడి నుంచి దర్యాప్తు చేయగా ఇందులో వినుకొండ లోని శ్రీ వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు కీలకపాత్ర పోషించినట్లు తేలింది. కాగా ఈ ఘటనపై జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నార్త్ డీఎస్పీ సిహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరిపి ఇందుకు బాధ్యులైన వివేకానంద బీఈడీ కళాశాల కరస్పాండెంట్ సయ్యద్ రఫిక్ అహ్మద్ తో పాటు నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన కళాశాల ప్రిన్సిపల్ ధూపాటి సురేష్ కుమార్, వినుకొండకు చెందిన కళాశాలలోని కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా స్వర్ణరాజ్, ఏజెంట్లు అయిన ఒడిశా రాష్ట్రంలోని అంగుల్ పట్టణానికి చెందిన సంతోష్ కుమార్ సాహూ, బరంపురం మండలం లంజీపల్లికి చెందిన బిష్ణు ప్రసాద్ పత్రో, నిస్సిమ్ కోయిల్ మండలం పాయకాపూర్ గ్రామానికి చెందిన సుకాంత్ బెహరా, కోరంపూర్ జిల్లా బైపరిగూడకు చెందిన పురుషోత్తం ప్రధాన్, నయాపల్లికార్డకు చెందిన ధీరేన్ కుమార్ సాహూ, అదేవిధంగా బీఈడీ విద్యార్థులైన ఒడిశా రాష్ట్రంలోని భైరవ చొక్కా గ్రామానికి చెందిన ప్రియాబత్రో గోడయ్, రాయగడ జిల్లా కటికల్ గ్రామానికి చెందిన మిలాన్ తృప్తి అనే పదిమందిని అరెస్టు చేశారు. వారి నుంచి 13 సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గంలో పర్యావరణ, కాలుష్య రహిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే ప్రవీణ్ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై మాట్లాడారు. పెదకూరపాడు మండలంలోని గారపాడులోని 300 ఎకరాల ఉమ్మడి భూమిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడి రైతులు మిరప, పత్తి, వరిని ఎక్కువగా సాగు చేస్తుంటారని, ఈ ప్రాంతం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అనువుగా ఉంటుందన్నారు. వ్యవసాయం పై ఆధారపడి జీవించే యువకులకు ఉద్యోగ, ఉపాధి లభించే అవకాశం ఉంటుందని ప్రవీణ్ అన్నారు.

పరిశ్రమల శాఖ మంత్రికి వినతి..

నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ కల్పనలో భాగంగా నియోజక వర్గంలో ఇండస్ట్రియల్‌పార్కు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రవీణ్ సోమవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతి పత్రం అందించారు.



మంత్రి భరత్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

డీ-పట్టాలతోనే సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు ఆటంకం

- స్థలాల ధరలు పడిపోతాయంటున్న యజమానులు
- నామమాత్రంగా ఫీజు నిర్ణయించి రిజిస్ట్రేషన్ చేస్తేనే మేలని వాదన



గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మరో అవకాశం విజయవంతం కావాలంటే కొన్ని సవరణలు తప్పనిసరన్న అభిప్రాయం వివిధ వర్గాల ద్వారా వ్యక్తమౌతున్నది. ముఖ్యంగా 150 చదరపు గజాల లోపు భూములకు డీ-పట్టా మంజూరు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టింది. దీని వలన పదేళ్ల వరకు ఆ స్థలాన్ని విక్రయించుకొనే అవకాశం ఉండదు. ఈ కారణంగా చాలామంది భూయజమానులు సీలింగ్ పరిధిలో ఉన్న తమ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ కేవలం గడువు మాత్రమే పొడిగించడం వలన ఎలాంటి ఉపయోగం లేదన్న అభిప్రాయం వినవస్తోన్నది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లో చర్చకు లేవనెత్తితే కొంత మేలు జరిగే అవకాశం ఉన్నది.

పట్టణ భూపరిమితుల చట్టం 1976 ప్రకారం ప్రభుత్వ పరిధిలోకి వచ్చినటువంటి సీలింగ్, మిగులు భూముల్లో ఉన్న ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఈ ఏడాది ఆఖరు వరకు ప్రభుత్వం అవకాశం కల్పిం చింది. దీని వలన 150 చదరపు గజాల వరకు అన్ని అర్హతలు కలిగిన వారికి ఉచితంగా డీ-పట్టా మంజూరు చేయడం జరుగుతుంది. అయితే ఇక్కడే అసలు సమస్య ఉన్నది. సీలింగ్ భూమి అయినప్పటికీ ఏదో ఒక సర్వే నంబరుతో భూ అనుభవదారులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయిం చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు వాటికి డీ-పట్టా తీసుకొంటే మార్కెట్ విలువ పతనం అయిపోతుంది. గుంటూరు జిల్లా పరిధిలో 3600 సీలింగ్ భూములున్నట్లు అంచనా వేస్తున్నారు. క్రితంసారి అవకా శం కల్పించినప్పుడు 800 మంది వరకు దరఖాస్తు చేసుకొన్నారు. వాటిల్లో 300లకు పైగా విచారణ పూర్తయి ప్రభుత్వానికి వెళ్లాయి. కాగా ప్రస్తుతం 2800 వరకు ఉన్నాయి. వీటిల్లో 1700 మంది భూములు 150 చదరపు గజాల లోపే ఉన్నాయి. వీళ్లంతా క్రమబద్ధీకరించుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇందుకు కారణం ప్రస్తుతం వాళ్ల భూములు రిజిస్ట్రేషన్ అయి ఉండటమే. ఈ నేపథ్యంలో వీళ్లకు కూడా ఎంతో కొంత ఛార్జీలు నిర్ణయించి రిజిస్ట్రేషన్ చేస్తేనే ముందుకొస్తారు. కాగా 150 నుంచి 300 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 15 శాతం చెల్లించుకొని రిజిస్ట్రేషన్ చేస్తారు. 300 నుంచి 500 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 30 శాతం, 500 చదరపు గజాల కంటే ఎక్కువ ఉంటే 100 శాతం బేసిక్ విలువ చెల్లించాలి. వీళ్లందరికి కన్వేయన్స్ డీడ్స్ ఇస్తారు. అలానే భూములను సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేయించుకొనే వెసులుబాటు ఉంటుంది. అంతేకాకుండా వాటిని నిషేధిత భూముల జాబితా నుంచి కూడా తొలగిస్తారు. అయితే ఈ వెసులుబాటు 150 చదరపు గజాల లోపు వాళ్లకి కల్పించకపోవడం వలన పెద్దగా భూయజమానులు ముందుకొచ్చే పరిస్థితి జిల్లాలో లేదు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

'ఏడాదైనా ఉద్యోగ విరమణ ధ్రువపత్రం ఇవ్వలేదు'

నరసరావుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ ధ్రువపత్రం ఇవ్వలేదని రిటైర్డు వీఆర్‌వో షేక్ కరిముల్లా అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ కరిముల్లా మాట్లాడుతూ శావల్యాపురం మండలం మతుకుమల్లిలో వీఆర్‌వో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశానన్నారు. ఉద్యోగ విరమణ గత ఏడాది ఏప్రిల్ 30 చేశానని, ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ ధ్రువపత్రం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సర్టిఫికేట్ ఇప్పించాలని వేడుకున్నారు.

12న యువత పోరును విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో యువతపోరు పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. 12వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక గుంటూరు రోడ్డులోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు.

వినుకొండలో...

వినుకొండ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీన జరిగే యువత పోరును విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థుల పక్షాన అండగా నిలుస్తూ ఈ నెల 12వ తేదీన జిల్లా వైసీపీ కార్యాలయం నుంచి కలెక్టర్ ఆఫీసు వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి యువత పోరు కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి: మునిసిపల్ చైర్మన్ రఫాని

చిలకలూరిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటిని వృథా చేయవద్దని మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని సోమవారం కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎక్కడైనా మంచి నీటి కుళాయిలకు లీకులు ఏర్పడి వృథాగా నీరు పోతుంటే మునిసిపల్ సిబ్బందికి తెలియచేసి సహకరించాలని అన్నారు. పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బుధవారం నుంచి శుక్రవారం వరకు సదరం రీ వెరిఫికేషన్

● డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు

నరసరావుపేట లీగల్, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, గురజాల, వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లిలో ప్రతి బుధవారం నుంచి శుక్రవారం వరకు అంగవైకల్యం ఉన్నవారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. కంటికి సంబంధించి నరసరావుపేటలో మాత్రమే నిర్వహిస్తామన్నారు.

'ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు సామాజిక పింఛన్ వర్తింపజేయాలి'

నరసరావుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు సామాజిక పింఛను వర్తింపజేయాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం నరసరావుపేట పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు అతితక్కువ పెన్షన్ రూ.1000లు నుంచి రూ.1500 లు తో కుటుంబం జీవనం సాగించాల్సిన దుర్భర పరిస్థితి ఉందన్నారు.

డీపీటీవోగా మధు బాధ్యతల స్వీకరణ

నరసరావుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో నరసరావుపేట డీపీటీవోగా ఎం మధు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి పదోన్నతిపై నరరావుపేట వచ్చారు.

అడవి పేరంటాలమ్మ ఆలయంలో చోరీ

బొందిలిపాలెం (శావల్యాపురం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేవాలయ గేట్లకు, హుండీలకు వేసిన తాళాలు పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు నగదును అపహరించిన సంఘటన శావల్యాపురం మండలం బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయంలో ఆదివారం అర్థరాత్రి జరిగింది. గుడిలోని రెండు హుండీలను పగులగొట్టి సుమారు రూ.20వేలు నగదు అపహరించారు. గుడిలోని సీసీ కెమెరాల కోసం అమర్చిన డీవీఆర్ బాక్స్ కూడా అపహరించారు. గేటుకు తాళం పగులగొట్టి ఉండటాన్ని ఉదయం వాచ్‌మెన్ గమనించి గ్రామస్థులకు తెలిపి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గతేడాది జులై 23వ తేదీన కూడా చోరీ జరిగింది. 8నెలల వ్యవధిలో రెండోసారి చోరీ జరగడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

కలెక్టర్ అరుణ్‌బాబు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి పనిచేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 62 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలాల్లో జీఎస్‌డబ్ల్యూ ఎస్ సర్వేలు, పీ4 సర్వేను పర్యవేక్షించాలని, ఎంఎస్ఎం ఈ సర్వే పురోగతిని కూడా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ గనోరే, డీఆర్‌వో మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం నూతనంగా ఏర్పాటుచేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు భూ సమస్యల గురించి 7 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ సురేష్ సోమవారం తెలిపారు.

● రొంపిచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో రెండు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. వీరవట్నం నుంచి రైతు రైల్వే నిర్మాణ పనుల్లో భూమి పోయిందని, నగదు పడలేదని ఫిర్యాదు చేశారు. పరగటిచర్ల గ్రామానికి చెందిన రైతు భూమి విస్తీర్ణం తగ్గిందని ఫిర్యాదు చేశారు.

● ఈపూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరష్కార వేదికకు ఒక్క ఫిర్యాదు అందినట్లు తహసీల్దారు ఏ నళిని చెప్పారు. ఈనాం భూములకు 1బీ, అడంగులు రావడం లేదని ఈపూరు గ్రామానికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో 106 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో 106ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

వృత్తి నుంచి వ్యాపారానికి మారాలి

నరసరావుపేట కల్చరల్, మార్చి, 10 (ఆంధ్రజ్యోతి): చెత్తను సేకరించే యానాదులు వృత్తి నుంచి వ్యాపారం వైపునకు మార్పు చెందాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. సోమవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన చెత్త సేకరించే వారికి జీవనోపాధి మెరుగు పరుచుకునేందుకు నాలుగు చక్రాలు, మూడు చక్రాల బండ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు వాహనాలను పంపిణీ చేసిన అనంతరం వారితో మాట్లాడుతూ సంస్థ ఇచ్చిన బండ్లను వ్యాపారరంగంలో ఉపయోగ పెట్టుకుని, అభివృద్ధిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, నరసరావుపేట ఏరియా కో ఆర్డినేటర్ తోకల సాంబయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంస్థ డైరెక్టర్ దేవకుమార్, డిప్యూటీ డైరెక్టర్ శామ్యూల్‌లను అభినందించారు.

గ్లకోమా వారోత్సవంపై పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట లీగల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గ్లకోమా వారోత్సవం సందర్భంగా సోమవారం పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో గ్లకోమాపై అవగాహన కోసం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 9 నుంచి 15వరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేలో భాగస్వాములు కండి

నరసరావుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర-2047లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పీ4 విధానం అమలుకు కసరత్తు జరుగుతోంది. దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన పీ4 సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానానికి ఉగాది నుంచి శ్రీకారం చుట్టనుందని తెలిపారు. ప్రభుత్వం, దాతలు, ప్రజా భాగస్వామ్యంతో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ఈ పీ4 విధానం అమలు కానుందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి లేదా స్వర్ణాంధ్ర, ఏపీ.జీవోవీ.ఇన్/పీ4 లింక్ ద్వారా ఈ నెల 25లోగా అభిప్రాయాలు తెలియజేస్తే సలహాలను ప్రశంసిస్తూ ఒక ప్రశంసా పత్రాన్ని అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, డీఆర్వో మురళీ తదతరులు పాల్గొన్నారు.

తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే

కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో బాలికల కోసం పాఠశాల స్థాపించి సావిత్రీబాయిపూలే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రకెక్కిందని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే కృష్ణ అన్నారు. సోమవారం సావిత్రిబాయి పూలే 128వ వర్థంతి సదస్సు నరసరావుపేట పట్టణంలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సదస్సులకు రాష్ట్ర అధ్యక్షుడు క్రిష్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సావిత్రీబాయిపూలే అంటరానితనం నిర్మూలన, స్త్రీల సమస్యల పరిష్కారం కోసం మొదటిసారిగా మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. మహిళ అభివద్ధి, చైతన్యం, హక్కుల కోసం నిరంతరం సావిత్రీబాయిపూలే కృషిచేశారన్నారు. సదస్సులో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.శ్రీనివాసులు, ప్రజా కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటి, రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకటరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఓర్సు శ్రీనివాసరావు, టీ శ్రీరాములు, నాగేశ్వరరావు, కుసుమకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

చిలకలూరిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి పూలే వర్థంతిని సోమవారం శ్రీమహాత్మ జ్యోతిరావు పూలే చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఉప్పాల భాస్కరరావు మాట్లాడుతూ చిలకలూరిపేటలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో తక్షణం బీసీ భవన్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కస్తూరి వెంకటేశ్వర్లు, శ్రీ మారుబోయిన శ్రీనివాసరావు, పోటు శ్రీనివాసరావు, ఉండవల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి పోట్రు పూర్ణచంద్రరావు, పవన్ కుమార్ గాంధీ, గోరంట్ల పిచ్చయ్య నివాళులర్పించారు.

● తుమ్మలకుంట (శావల్యాపురం): భారతదేశ తొలి మహిళా అధ్యాపకురాలు సావిత్రీబాయి పూలే వర్థంతిని మండలంలోని కొత్తలూరు పంచాయతీ పరిధిలోని తుమ్మలకుంట ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి హెచ్ఎం బిళ్లా రాజారమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

నేడు స్వస్థలానికి వంశీకృష్ణ మృతదేహం

● అమెరికాలో మృతిచెందిన వేలూరి వాసి



వంశీకృష్ణ (ఫైల్‌ఫొటో)

చిలకలూరిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందిన విద్యార్థి కందిమళ్ళ వంశీకృష్ణ (25) మృతదేహాన్ని అతడి స్వగ్రామమైన చిలకలూరిపేట మండలం వేలూరుకు తీసుకువచ్చేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో విమానంలో వంశీకృష్ణ మృతదేహంను హైదరాబాద్‌కు తీసుకువస్తున్నారు. వంశీకృష్ణ విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో బీటెక్ పూర్తి చేసి, మూడు సంవత్సరాల క్రితం అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని హోస్టన్‌లో ఎంఎస్ చేసేందుకు వెళ్లాడు. ఈ నెల 2వ తేదీన వంశీకృష్ణ ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్ళి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆ విషయం వారి తల్లిదండ్రులకు మూడు రోజుల తర్వాత తెలిసింది. వంశీకృష్ణ సోదరి వైష్ణవి కూడా న్యూయార్క్‌లో ఎంఎస్ ఇటీవలనే పూర్తి చేసింది. వంశీకృష్ణ తండ్రి కందిమళ్ళ రామకృష్ణ మాట్లాడుతూ వేలూరులో తనకు ఎకరం పొలం ఉన్నదని, 30 ఏళ్లగా గ్రామంలో టీ దుకాణం నిర్వహిస్తున్నానని చెప్పారు. తన ఇద్దరు పిల్లలను విద్యారుణం తీసుకొని ఉన్నత చదువుల కోసం అమెరికాకు పంపానన్నారు. కుమారుడి మృతదేహాన్ని ఇక్కడకు తెచ్చుకునే ఆర్థిక స్తోమత కూడా తనకు లేదన్నారు. అయితే తమ బంధువులు, తమ పిల్లల స్నేహితులు, ఇతరులు సామాజిక మాధ్యమాలలో సమాచారం పంచుకొని, అందరూ కలిసి చేయూత ఇవ్వడంతో ఎట్టకేలకు మృతదేహం స్వదేశానికి తీసుకువస్తున్నట్లు చెప్పారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని వినతి

శావల్యాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిపై, ఆయనకు సహకరించిన అధికారులపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని రైతు గాలి వెంకటేశ్వర్లు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని పిచికలపాలెం గ్రామానికి చెందిన రైతు గాలి వెంకటేశ్వర్లు శావల్యాపురం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో తహసీల్దార్ సురేష్‌కు లిఖితపూర్వకంగా అర్జీ అందజేశారు. పిచికలపాలెం రెవెన్యూపరిధిలోని 324-సి సర్వేనెంబర్‌లో సీతయ్య రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తనకు అమ్మిన పొలంలో 47సెంట్లను అతని పేరుతో ఆన్‌లైన్ చేయించుకొని చేబ్రోలు శిరీష అనే మహిళకు రెండోసారి రిజిస్టేషన్ చేశాడన్నారు.

టీడీపీ బీసీల పార్టీగా మరోసారి రుజువైంది: గంగాధర్

నరసరావుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో టీడీపీ బీసీల పార్టీగా మరోసారి రుజువైందని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, టీడీపీ వడ్డెర సాధికార సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలకొండ నరసింహారావు సోమవారం వేరువేరు ప్రకటనలలో అన్నారు. కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని నామినేటెడ్ పదవులలో బీసీలకు ఏ ప్రభుత్వం ఇవ్వని ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఎమ్మెల్సీలుగా ఇద్దరు బీసీలు, ఒక దళిత మహిళకు కేటాయించి బడుగు, బలహీన వర్గాలకు చంద్రబాబు పెద్దపీట వేశారన్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే సాధ్యమని నిరూపించారని, బీసీలందరూ చంద్రన్నకు అండగా ఉంటారని తెలిపారు.

ఎన్ఈసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నరసరావుపేట రూరల్, మార్చి 10, (ఆంధ్రజ్యోతి), మండలంలోని నర్సరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ నెల 7 ,8 తేదీల్లో గుంటూరులోని మలినేని లక్ష్మయ్య మహిళా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనపరచి పలు పతకాలు సాధించినట్లు కళాశాల నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటన తెలిపారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన వర్క్ షాప్

నరసరావుపేట రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమన్ రోబోటిక్స్‌పై ఐదు రోజులపాటు నిర్వహించిన వర్క్ షాపు సోమవారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ తెలిపారు. రిసోర్స్ పర్సన్‌గా సురేంద్రబాబు వ్యవహరించారు.

కక్ష సాధింపుతోనే వైసీపీ శ్రేణులపై తప్పుడు కేసులు

● మాజీ మంత్రి విడదల రజని

నరసరావుపేట లీగల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రేణులపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిస్తోందని మాజీ మంత్రి వైసీపీ నాయకురాలు విడుదల రజని సోమవారం అన్నారు. స్థానిక సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ కార్యకర్త రాకేష్‌గాంధీని పరామర్శించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేక తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే సోషల్ మీడియా కార్యకర్తలను ఉక్కుపాదంతో అణచివేస్తున్న దుర్మార్గమైన పాలనను చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. పత్తిపాడు పుల్లారావు ఒత్తిడితోనే ఈ తప్పుడు కేసులు బనాయించారన్నారు.

వినుకొండ వాసికి గౌరవ డాక్టరేట్

వినుకొండ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వినుకొండ వాసి బొంత రాజీవ్ గత కొన్నేళ్లుగా తల్లిదండ్రులు లేని పిల్లలకు చేస్తున్న సేవలకు గాను ఊటీలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో సోషల్‌సర్వీస్ కేటగిరిలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తండ్రి బొంత కోర్నేలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కోర్నేలు మాట్లాడుతూ తన కుమారుడు రాజీవ్ హైదరాబాద్‌లోని హయత్ నగర్‌లో సుదీర్ ఫౌండేషన్‌ను స్థాపించి 120మంది అనాథ, పేద విద్యార్థులకు నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు స్వచ్ఛంద సేవ చేస్తున్నారన్నారు.

సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణం

ఈపూరు, మార్చి (ఆంధ్రజ్యోతి): ఈపూరు బోటు మీద ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళను పురస్కరించుకొని సోమవారం సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణం వైభవంగా జరిపారు. మంగళవారం తిరునాళ్ళ రోజు స్వామికి అభిషేకాలు, ఆకుపూజ జరపనున్నారు. తిరునాళ్ళకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం

నూజెండ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ అప్పాపురంలో సోమవారం గోవిందాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ మొదటి వార్షికోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పూర్ణాహుతి, కల్యాణోత్సవం, అభిషేకాలు, అర్చనల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం: తహసీల్దారు నళిని

ఈపూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని తహసీల్దారు ఏ నళిని అన్నారు. ఈపూరు రైతు సేవా కేంద్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికపై వ్యవసాయ, ఉద్యానవన, వెలుగు శాఖల అధికారులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు, వెలుగు ఏపీఎం రంగారెడ్డి, ప్రకృతి వ్యవసాయం జిల్లా శిక్షకుడు సైదయ్య వివిధ అంశాలపై మాట్లాడారు. వేసవిలో విత్తనాలు మొలకెత్తడానికి వీలుగా విత్తన గుళికల విధానం ఎలా చేయాలో డెమోచేసి చూపించారు. సమావేశంలో ఎంపీడీవో కే ప్రభాకర్, సీసీలు నరేష్‌రెడ్డి, రామారావు, నాగేశ్వరరావు, గిరిబాబు, సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు, ప్రకాశరావు, భాస్కరరావు, శివలక్ష్మి, లక్ష్మీదుర్గా, హనుమంతురావు, లక్ష్మానాయక్, యూనిట్ ఇంచార్జి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

బొల్లాపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అలీషా, మహిళా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల గొప్పతనాన్ని, సమాజానికి వారు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాగుల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రధానమైన ఓగేరు, కుప్పగంజి, నక్క వాగులను తక్షణం ఆధునీకరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం అన్నారు. వాగుల సమస్యను ఆయన అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ వాగులలో పేరుకుపోయిన పూడిక, కంప, తూటికాడ తొలగింపుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. పూడిక కారణంగా వాగులకు వరదలు వచ్చినప్పుడు అవి పొంగి పొలాల మీదకు, చిలకలూరిపేట పట్టణంలోకి నీరువస్తున్నదన్నారు.కొన్నిచోట్ల వాగులు ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. దీనిపై సర్వే కూడా అవసరమని పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఈ సమస్యలపై దృష్టిపెట్టి ఈ వేసవిలోనే వాగులకు మరమ్మతులు చేయించి, రైతులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ అధికారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ గ్రీవెన్స్‌లో సామాజిక కార్యకర్త ఫిర్యాదు

నాదెండ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో లక్షలాది రూపాయలు అవినీతి జరిగినా చర్యలు తీసుకోకుండా కార్యదర్శులకు మద్దతుగా ఉన్న పల్నాడు జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డిపై మండలంలోని చందవరం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త యన్నం వెంకట రమణారెడ్డి సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. పలువురు కార్యదర్శులు చందవరం పంచాయతీలో లక్షలాది రూపాయలు అవినీతికి పాల్పడినట్టు డివిజనల్ పంచాయతీ అధికారి నివేదిక ఇచ్చినా పట్టించుకోక పోవటం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో జరిగిన అవినీతి విచారించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల నిరసన

వినుకొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు వేతనాలను పెంచి మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో విడుదల చేయాలని కోరుతూ వినుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ నాయకురాలు ప్రసూనాంబ మాట్లాడుతూ 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని, ఇప్పటికైనా అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ షకీలా, షేక్ మున్ని, ఉమాశంకరి, నీరజ, పద్మ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ జీ రమేష్ కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీని అమలుచేయాలని తదిత పది డిమాండ్లను వారు వినతి పత్రంలో తహసీల్దార్‌కు అందజేశారు.

వైభవంగా శివలింగ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

నాదెండ్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో సోమవారం శివలింగ శ్రీనివాస అభయాంజనేయ స్వాముల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతాలాంబదేవి పక్కన అడుగు ఎత్తు గల శివలింగాన్ని, జాతీయ రహదారి పక్కన మద్ది లక్ష్మయ్య కంపెనీ ప్రాంతంలో శ్రీనివాస అభయాంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాత్రి నుంచి ఆంజనేయుని విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. హోమాలు చేశారు. ఊరేగింపుగా శివలింగం, అభయాంజనేయ స్వామి విగ్రహాలను తరలించారు. కాగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పారిశ్రామిక వేత్త పేర్ని వీర నారాయణలు ప్రత్యేక పూజలు చేశారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మునిసిపల్ చైర్మన్ షేక్ రఫానీ రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం రాత్రి పట్టణంలోని 10వ వార్డు, గుర్రాల చావిడి వద్ద ముస్లిం సోదరులకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రదానం అభినందనీయం: చలపతిరావు



నేత్రదానం చేసిన చినలింగయ్య

వేల్పూరు (శావల్యాపురం) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వ్యక్తి నేత్రాలను మరొకరికి దానంచేసి వారికి చూపును ప్రసాదించడం అభినందనీయమని అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన దొప్పలపూడి చినలింగయ్య (75) వృద్ధాప్యంతో సోమవారం మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులు మృతుడు చినలింగయ్య నేత్రాలను దానం చేశారు. చలపతిరావు ఇచ్చిన సమాచారంతో పెదకాకాని శంకర్ ఆసుపత్రి ఐ బ్యాంక్ సిబ్బంది వేల్పూరుకు వచ్చి మృతుడు చినలింగయ్య కళ్ళలోని కార్నియా పొరలను సేకరించారు. చలపతిరావు మాట్లాడుతూ నేత్రదానం చేయదలచినవారు మృతదేహాన్ని ఏసీబాక్స్‌లో ఉంచి 8 గంటల్లోపు దానం చేయాలని, వ్యక్తి చనిపోయిన వెంటనే ఐ బ్యాంక్ సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు. నేత్రదానం చేసిన చినలింగయ్య కుటుంబసభ్యులు పెదఅంజయ్య, చినఅంజయ్య, పెదఆదెయ్య, అంజమ్మ, అనిల్, నాయుడు తదితరులను ఐ బ్యాంక్ సిబ్బంది, గ్రామపెద్దలు, గ్రామస్థులు అభినందించారు.



ధర్నా నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

విశ్వహిందూ పరిషత్ నాయకుల నిరసన

నరసరావుపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో వీరభద్ర స్వామి ఉత్సవాల ఊరేగింపుపై కొందరు దుండగులు దాడిచేసి విధ్వంసం సృష్టించారని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నరసరాపేట పట్టణంలో రాయచోటిలో 1300 సంవత్సరాల నుంచి జరుగుతున్న వీరభద్రస్వామి ఉత్సవాల ఊరేగింపుపై జరిగిన దాడికి నిరసనగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి గాంధీ పార్కువద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు ఏవీఆర్‌కే సత్యనారాయణ, బీవీ వీరాంజనేయులు, కొలిశెట్టి సుబ్బారావు, జేడీ రాజేశ్వరి, కే.శారద, బత్తుల మురళి, చేగు వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, కాకుమాను కోటేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ కొత్త రాము, జయ, రమేష్, లక్ష్మీప్రసాద్, సీతారాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.